


మా కలం - సామాన్యుడి బలం


# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమారుడి వివాహ రిసెప్షన్ కు చంద్రబాబు




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 223 | మంగళవారం 18 - 08 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి..

### ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

డీఎస్సీ పరీక్షను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించామన్న లోకేశ్

విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చామని వెల్లడి

వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిందని మండిపాటు

2లో



ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. సభలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... డీఎస్సీ నిర్వహణ, విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలపై కీలక వివరాలు వెల్లడించారు. డీఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించిందని, ఎన్నికల సమయంలో



# గ్రూప్ -1 అక్రమాలపై సీఎం సీరియస్

డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్ లైన్‌లోనే

డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు

ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెన్జీలతో ఫేక్ ప్రదర్శనలు

ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపీకి సవాల్

శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం

నా 50ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి స్కాం చూడలేదని వ్యాఖ్య

2లో

మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు.

## నాగబాబుకు కీలక పదవి..

### కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జనసేన ఎమ్మెల్సీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబుకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది.

ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా నాగబాబు నియామకం

రాష్ట్రంలో పచ్చదనాన్ని విశేషంగా పెంచడమే ఈ కమిటీ లక్ష్యం

2లో

పర్యావరణ సమతుల్యత, అడవుల విస్తరణే ప్రధాన లక్ష్యం

## ప్రతిపక్షహోదా కోసం మారాం చేస్తున్న వైకాపా

మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎద్దేవా

'పాఠాలు చెప్తాం.. గుణపాఠాలు కూడా నేర్పుతాం' అంటూ టీచర్లు చేస్తున్న ర్యాలీలను గొడ్డలి పార్టీ గుర్తు పెట్టుకోవాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారంఅసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. గిరిజనులను గొడ్డలి పార్టీ నాయకులు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. చిన్నపిల్లలకు చాక్లెట్ ఇవ్వకపోతే

## మండలిలో 'డీఎస్సీ' రగడ..



గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు 'మెగా డీఎస్సీ' ఇస్తామని ఆశలు రేపి, చివరికి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీకి ఇప్పుడు డీఎస్సీ నియామకాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న అచ్చెన్నాయుడు

మెగా డీఎస్సీ-2025లో అవకతవకలపై సీబీఐ విచారణకు విపక్షం డిమాండ్

విద్యాశాఖ మంత్రిగా బొత్స విఫలమయ్యారంటూ అచ్చెన్న విమర్శలు

2లో

అచ్చెన్న వ్యాఖ్యలపై దుమారం, క్షమాపణ చెప్పాలని విపక్షం పట్టు

గందరగోళం మధ్య శాసనమండలి రెండు సార్లు వాయిదా

## అది నేరమా?..

టెట్ నుంచి మినహాయింపు కోరిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారన్న జగన్

చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం

2లో

ఇది కక్ష సాధింపు చర్యేనని సోషల్ మీడియాలో విమర్శలు

సస్పెన్షన్లు ఎత్తివేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్

టీచర్లకు న్యాయపరంగా అండగా ఉంటామని హామీ



ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులపై

## బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

మంటు క్షణాల్లో వ్యాపించడంతో ఏడుగురు మృతి

నిద్రలో ఉండగా తెల్లవారు జామున ప్రమాదం



పశ్చిమ బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఓ నాలుగు అంతస్తుల హోటల్ భవనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనం కాగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీ యూనిట్లలో సాంకేతిక లోపం కారణంగా మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు చెలరేగడంతో గ్రౌండ్ ఎ÷–లోర్ మొత్తం క్షణాల్లోనే పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు 2లో

## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు..

### తెలంగాణకు నో ప్లేస్!



బీజేపీ కొత్త జాతీయ టీమ్‌ను ప్రకటించిన నితిన్ నబిన్

ఏపీ నుంచి ముగ్గురికి కీలక పదవులు 2లో

పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్ష పదవులు

విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో-ఆర్డినేటర్ బాధ్యత

స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కొత్త జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి కీలక బాధ్యతలు దక్కాయి. డి. పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు జాతీయ ఉపాధ్యక్ష పదవులు వరించాయి. విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో–ఆర్డినేటర్ బాధ్యతలు

## రాహుల్ గాంధీ ఆస్తుల కేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ప్రశ్న.



లక్నో హైకోర్టు ఉత్తర్వులపై స్టే!

రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు కేసులోని ఆరోపణలు అంత తీవ్రమైనవైతే సీబీఐ, ఈడీ ఇన్నాళ్లు ఎందుకు ఊరుకున్నాయన్న సుప్రీంకోర్టు కోర్టుల నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు ఎందుకు వేచి చూశాయని ప్రశ్న

కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు విచారణలో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థలు (సీబీఐ, ఈడీ), కేంద్ర ప్రభుత్వంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది.

## యూపీలో జడ్జి సంచలనం..

### 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!



యూపీలో ఓ జడ్జి నాలుగు నెలల్లో 22 మందికి ఉరిశిక్ష విధించిన జడ్జి

ముజఫర్‌నగర్ అదనపు సెషన్స్ జడ్జి రవికుమార్ దివాకర్ తీర్పులు

2లో

న్యాయవాది హత్య, దోపిడీ వంటి 10 తీవ్రమైన కేసుల్లో ఈ శిక్షలు ఖరారు

# గ్రూప్-1అక్రమాలపై సీఎం సీరియస్

మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 10-12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు. "అని ముఖ్యమంత్రి అన్నారు.

**డీఎస్సీ నియామక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే** "గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పిలేట్ అథారిటినీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్ లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఎఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. డీఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో ,90 ఏళ్ల జగన్ జెన్ జీ వ్యక్తులతో ధర్నాలు చేయించింది. ఈ ఆరోపణల్ని ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారు. మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో పెద్ద ఎత్తున టీచర్లు ఆందోళన చేశారు. పిల్లలకు పాఠాలు చెబుతాం, ప్రతిభను కించ పరిస్తే గుణపాఠం కూడా చెబుతామని వారు నినదించారు"అని ముఖ్యమంత్రి అన్నారు.

**అసెంబ్లీకి రాకుండా పబ్జీలు"** మా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ, కుట్రలు చేసే పార్టీలకు, వ్యక్తులకు కాదు. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నాను. అసెంబ్లీకి వస్తే అడ్డంగా దొరికిపోతారనే వాళ్లు రావటం లేదు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ కుట్రలూ పనిచేయవని డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి చెబుతున్నాను. పూర్తి పారదర్శకతతో బాధ్యతతో, పూర్తి జవాబు దారీతనంతో నియామకాలు జరిగాయి. విద్యావిధానంలో సంస్కరణలతో పాటు పరీక్షల్లోనూ మరింత పారదర్శకత తీసుకువస్తాం. సిగ్గులేని ఆ పార్టీ అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. బాధ్యత కలిగిన వ్యక్తులు శాసనసభకు వచ్చి డిమాండ్ చేయాలి. రెండున్నర ఏళ్ల నుంచి అసెంబ్లీకి రాని పార్టీని చూడటం నా జీవితంలో ఇదే తొలిసారి. అసెంబ్లీకి రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. అనే నేనుగా నాకు ప్రజలపై పూర్తి బాధ్యత ఉంది. వారికి ఏముందో ప్రజలే చెప్పాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు.. తెలంగాణకు నో ప్లేస్!

అప్పగించారు. అదే సమయంలో తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా జాతీయ టీమ్‌లో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్త కార్యవర్గంలో కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, ఒడిశాకు చెందిన బైజయంత్ పాండా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రేఖా వర్మ, తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగనున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీరత్ సింగ్ రావత్, పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ బాదల్ సహా పలువురికి ఇదే బాధ్యతలు అప్పగించారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో మహిళలకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమెకు లభించిన తొలి కీలక సంస్థాగత బాధ్యత ఇదే. వినోద్ తావ్‌డే, సునీల్ బన్సల్, బిప్లవ్ కుమార్ దేవ్ సహా పలువురు ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. వసుంధర రాజే, స్మృతి ఇరానీ మళ్లీ కీలక సంస్థాగత పదవుల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఎల్ సంతోష్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా కొనసాగనున్నారు. శివప్రకాశ్, సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత)గా బాధ్యతలు చేపట్టనున్నారు. పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి పదవి ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రను నియమించారు. పార్టీ మీడియా వ్యవహారాలను అనిల్ బలూనీ చూసుకోనున్నారు. తెలంగాణకు మాత్రం ఈసారి జాతీయ కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. గతంలో డీకే అరుణ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. కొత్త టీమ్‌లో ఇద్దరికీ చోటు దక్కలేదు. తెలంగాణలో పార్టీని మరింత విస్తరించడమే తదుపరి లక్ష్యమని బీజేపీ చెబుతున్న సమయంలో.. జాతీయ స్థాయి పదవుల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

## బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

హుటాహుటిన అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు.. స్థానికులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. ÷ర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసి మృతులను, గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, బాధితులంతా ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులుగా తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనపై కోల్‌కతాకు చెందిన ఓ బాధిత మహిళ అతిథి స్పందించారు. హోటల్ మొత్తం పొగతో నిండిపోయిందని, దాని వల్ల చాలా మంది తప్పించుకోలేక పోయారని తెలిపారు. అలాగే, పలువురు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది పడ్డారని వెల్లడించారు. బయటకు వచ్చేందుకు దారీ కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ÷ర్ అలారం కూడా పనిచేయలేదని పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రాహుల్ గాంధీ ఆస్తుల కేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ప్రశ్న..

ఈ వ్యవహారంలో సీబీఐ, ఈడీ విచారణకు ఆదేశిస్తూ లక్నో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు స్పందిస్తూ... ఈ కేసులోని ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఇది ఆదాయానికి మించిన ఆస్తుల కిందకు వస్తుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... "ఆరోపణలు అంత తీవ్రమైనవే అయితే మీ దర్యాప్తు సంస్థలు ఇన్నాళ్లూ ఎందుకు ఊరుకున్నాయి? దర్యాప్తు లేదా విచారణ ప్రారంభించడానికి కోర్టుల నుంచి ఒత్తిడి లేదా ఆదేశాలు వచ్చే వరకు ఎందుకు వేచి చూశాయి? చట్టప్రకారం మీకున్న స్వయంప్రతిపత్తి అధికారాలతో సొంతంగా ఎందుకు చర్యలు తీసుకోలేదు?" అని ప్రశ్నించింది.

## యూపీలో జడ్జి సంచలనం.. 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కేవలం నాలుగు నెలల కాలంలోనే 10 వేర్వేరు కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఈ వరుస తీర్పుల నేపథ్యంలో దేశంలో మరణశిక్షల అమలుపై మరోసారి విస్తృత చర్చ ప్రారంభమైంది ప్రభుత్వ న్యాయవాది వెల్లడించిన వివరాల ప్రకారం, జడ్జి రవికుమార్ దివాకర్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ కీలక తీర్పులను వెలువరించారు. న్యాయవాది సమీర్ సఫీ హత్య కేసు, హోంగార్డు హత్య, హైవే దోపిడీ, ఆర్థిక లాభం కోసం కిడ్నాప్ చేసి హత్య చేయడం వంటి అత్యంత క్రూరమైన నేరాల్లో నిందితులకు ఈ కఠిన శిక్షలు ఖరారు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఒకరికి, జూన్‌లో ఇద్దరికి, జూలైలో ఏడుగురికి, ఆగస్టు 13 నాటికి మరో ఐదుగురికి మరణశిక్ష విధించారు. ఇటీవల ఆగస్టు 12న, 1999 నాటి కిడ్నాప్, హత్య కేసులో షానవాజ్‌కు, ఆగస్టు 13న షామ్లీ జిల్లాలో జరిగిన పవన్ కుమార్ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన తీర్పునిచ్చారు. జడ్జి దివాకర్ గతంలో బరేలీలో పనిచేస్తున్న సమయంలోనూ 13 మందికి మరణశిక్ష విధించిన చరిత్ర ఉంది. దీంతో ఆయన ఇప్పటివరకు తన పదవీ కాలంలో మొత్తం 35 మందికి మరణశిక్ష విధించినట్లయింది. 2022లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశాలు జారీ చేసి జడ్జి రవికుమార్ దివాకర్ దేశవ్యాప్త గుర్తింపు పొందారు. అయితే, సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్షలు అమలు కావాలంటే నిబంధనల ప్రకారం హైకోర్టు వాటిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాగే, ఈ తీర్పులను సవాలు చేస్తూ నిందితులకు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే చట్టపరమైన అవకాశం కూడా ఉంటుంది.

## రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా మండలస్థాయి ప్రజావాణి

### 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో నిర్వహణ

### మొత్తం 5,410 వినతుల స్వీకరణ ..10,753 మంది అధికారుల హాజరు

### జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి

### ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి వెల్లడి

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతమైంది. ప్రజల సమస్యలను వారి మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లయిందని ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు. మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు (పిటిషన్లు) అందాయి. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతులను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజావాణి కోసం అధికారులు శాఖ వారిగా డెస్క్ లు, హెల్ప్ డెస్క్ ను, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజలు సమర్పించిన వినతులను నేరుగా స్వీకరించడంతో పాటు, ఆయా సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ జిల్లా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 704 వినతులు స్వీకరించబడ్డాయి. అలాగే, ఒక మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ జిల్లా ముందంజలో ఉంది. కరీంనగర్ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 47 వినతులు అందాయి. మండల స్థాయిలోనే ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను ప్రజలకు మరింత చేరువ చేయడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా లేదా రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానిక స్థాయిలోనే సంబంధిత అధికారులకు తమ సమస్యలను వివరించే అవకాశం మండల స్థాయి ప్రజావాణి ద్వారా లభించింది. ÷-రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి, అధికారుల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతులు సమర్పించగా, అధికారులు కూడా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. కొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడి, 5,410 వినతులు స్వీకరించబడ్డాయి. ప్రజలు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

## ఒడా పునర్వ్యవస్థీకరణ

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ ఔథారిటీ (ఒడా) పునర్వ్య వస్థీకరణ జరిగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని అన్ని పట్టణ, స్థానిక సంస్థలు, మండలాల పరిధిలో ఈ సంస్థ ఏర్పాటు కాగా, ప్రస్తుతం మారిన జిల్లాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేశారు. ఈ క్రమంలో కొత్తగా మార్కాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కూడా ఏర్పాటైంది. గతంలో ఒడా ఏర్పాటైనప్పుడు తొలుత ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో ఉన్న మునిసిపాలిటీలు, మండలాలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వినుకొండ ప్రాంతాన్ని కూడా దాని పరిధిలో చేర్చారు. అనంతరం కొంత కాలానికి వినుకొండ ప్రాంతంతోపాటు ఉమ్మడి జిల్లాలోని కందుకూరు ప్రాంతాన్ని తొలగించారు. మిగిలిన ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని అన్నిప్రాంతాలూ ఒడాలోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా విభజన అనంతరం కూడా అలాగే కొనసాగుతూ వస్తోంది. ఒంగోలు కేంద్రంగానే ఆయా ప్రాంతాల కార్యకలాపాలు ఒడా ద్వారా సాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వం రాష్ట్రంలోని పలు పట్టణాభివృద్ధి సంస్థల్లో మార్పులు, చేర్పులు చేసింది. తదనుగుణంగా సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. **కొత్తగా కందుకూరు చేరిక** ప్రస్తుత ప్రకాశం జిల్లా పరిధిలోని ఒంగోలు కార్పొరేషన్, అద్దంకి, కందుకూరు, చీమకుర్తి, దర్శి మునిసిపాలిటీలతోపాటు జిల్లాలోని 28 మండలాలు ఒడా పరిధిలోకి వచ్చాయి. ఇందులో ఒంగోలు నియోజకవర్గంలో మూడు, సంతనూతలపాడులో నాలుగు, కొండపిలో ఆరు, అద్దంకిలోని ఐదు, దర్శిలోని ఐదుతోపాటు కందుకూరులోని ఐదు మండలాలు ఉన్నాయి. వీటిలో కందుకూరు మునిసిపాలిటీ, ఆ నియోజకవర్గంలోని ఐదు మండలాలు కొత్తగా చేర్చగా మిగిలినవన్నీ గతంలో కూడా ఉన్నాయి. **మార్కాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు** ఇప్పటివరకు ఒడా పరిధిలో ఉన్న ప్రస్తుత మార్కాపురం జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు. కనిగిరి, పొదిలి మునిసిపాలిటీలు, ఆ జిల్లాలోని 21 మండలాలతో 507 గ్రామాలతో కొత్తగా మార్కాపురం పట్టణాభివృద్ధి సంస్థ (ముడా) ఏర్పాటైంది. ముడా ద్వారా ప్రత్యేక నిధులు విడుదల కానున్నాయి. అలాగే ఇప్పటి వరకు ఒడా పరిధిలో ఉన్న చీరాల మునిసిపాలిటీ, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లోని 8 మండలాలను తొలగించారు.

## మండలిలో 'డీఎస్సీ' రగడ..

గత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుని ఇప్పుడు మండలిలో డీఎస్సీపై నీతులు చెప్పడం సిగ్గుచేటని ఆయన ఘాటుగా విమర్శించారు.సోమవారం ప్రారంభమైన ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే శాసనమండలి 'మెగా డీఎస్సీ-2025' అంశంతో దద్దరిల్లింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే, మండలి చైర్మన్ కె. మోషేను రాజు వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి, ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. చైర్మన్ నిర్ణయంతో ఏకీభవించని వైసీపీ సభ్యులు, సభా కార్యకలాపాలను అడ్డుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. డీఎస్సీ పేరుతో మూడు లక్షల మంది నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని, క్రీడల కోటాలో తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టారు.బొత్స ఆరోపణలపై అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. "గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని మీరు ఇప్పుడు మాట్లాడుతున్నారా? అధికారంలో ఉన్నప్పుడు చేతకాక, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక మండలిలో ప్రశ్నలు వేయడం రాజకీయ ద్వంద్వ నీతి కాదా?" అని బొత్సను నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు సకాలంలో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అయితే, దీన్ని అడ్డుకునేందుకు వైసీపీ ఏకంగా 300 కోర్టు కేసులు వేసిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఈ క్రమంలో బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అచ్చెన్నాయుడు చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. దీంతో వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. గందరగోళం నడుమ చైర్మన్ సభను వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత, అచ్చెన్నాయుడు తన అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బొత్స డిమాండ్ చేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ, తాను వాడిన పదాలు అన్‌పార్లమెంటరీ కావని, ఒకవేళ చైర్మన్ రూలింగ్ ఇస్తే క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అయినప్పటికీ వైసీపీ సభ్యులు నిరసన కొనసాగించడంతో, చైర్మన్ సభను రెండోసారి వాయిదా వేశారు.

## అది నేరమా?..

ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నేడు సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. "మొదటి రోజు వైఎస్సార్ కడప జిల్లా టీచర్ల సంఘం వారిని, రెండో రోజు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టీచర్లను సస్పెండ్ చేశారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు చేసిన నేరం ఏమిటి?" అని జగన్ సూటిగా ప్రశ్నించారు. సర్వీసులో చేరినప్పుడు లేని టెట్ నిబంధనను ఇప్పుడు అమలు చేయడంతో లక్ష మందికి పైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధన నుంచి మినహాయింపు కోరుతూ తమకు అండగా నిలిచిన ఎంపీల సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం నేరమా? అని జగన్ నిలదీశారు. తక్షణమే ఉపాధ్యాయుల సస్పెన్షన్లను రద్దు చేసి, వారికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ అన్యాయమైన సస్పెన్షన్లపై న్యాయపోరాటంలో టీచర్లకు వైసీపీ పూర్తి అండగా ఉంటుందని పేర్కొన్నారు. "మీ రెడ్ బుక్ అరాచక పాలన ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా వదలడం లేదు. చంద్రబాబు గారూ.. నిజానికి మీరే కేంద్ర ప్రభుత్వాన్ని ఈ టెట్ నిబంధనను తొలగించాలని కోరాలి కదా? ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు?" అని జగన్ విమర్శించారు. "మీరు చేయాల్సిన పని చేయలేదు. సీనియర్ టీచర్ల సమస్యలను గాలికొదిలేశారు. మా పార్టీ ఎంపీల మద్దతుతో వారు తమ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే, దానికి రాజకీయ రంగు పులిమి సస్పెండ్ చేశారు. మీరు చేయలేని పనిని వారు చేయడానికి ప్రయత్నించడమే వారి తప్పా? ఒక సమస్యను పరిష్కరించాల్సింది పోయి, దానికి రాజకీయ దురుద్దేశాలు ఆపాదించడం దారుణం. ఇంతగా ఎలా దిగజారిపోయారు?" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ చంద్రబాబు గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి మూడో ఏడాది నడుస్తున్నా మధ్యంతర భృతి (ఐఆర్), పీఆర్సీ హామీలు నెరవేర్చలేదని, ఐదు డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. "చంద్రబాబు గారూ.. అధికార అహంకారంతో మీరు వ్యవహరిస్తున్న తీరును, మీ నియంతృత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. చివరకు మీ నీడను చూసి కూడా మీరు సహించలేని స్థాయికి చేరుకున్నారు" అని జగన్ విమర్శించారు.

## 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి..

ఇచ్చిన హామీకి కట్టుబడి ఏకంగా 148 రోజుల్లోనే నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని సభకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ప్రతి ఏటా క్రమం తప్పకుండా డీఎస్సీ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని లోకేశ్ వివరించారు. ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా తెలిపారు. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు సింగపూర్, ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపిస్తుంటే, గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టి కించపరిచిందని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వంలో వ్యవస్థను ప్రశ్నించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై న్యాయస్థానాల్లో 336 కేసులు దాఖలైన విషయాన్ని మంత్రి గుర్తుచేస్తూ, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా దేశ చరిత్రలోనే తొలిసారిగా డీఎస్సీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని వెల్లడించారు. ఇక ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కి సంబంధించి 3.68 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 1.87 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారనే గణాంకాలను అసెంబ్లీ వేదికగా లోకేశ్ సమర్పించారు.

## నాగబాబుకు కీలక పదవి..

ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ (+తీవవఅ జు×వఎ్‌అజవ జశీఎఱ్‌వవ) చైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ, ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని విశేషంగా పెంచడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవుల విస్తరణే లక్ష్యంగా పనిచేసే ఈ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీకి నాగబాబు నేతృత్వం వహించనున్నారు. ఆయన సారథ్యంలో ఈ కమిటీ రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటిస్తూ పర్యావరణ పెంపొందింపు కార్యక్రమాలు, మొక్కలు నాటే భారీ ప్రాజెక్టుల పరిశీలన, పర్యవేక్షణను మరింత వేగవంతం చేయనుంది. పర్యావరణ పరిరక్షణకు మేలు చేకూరేలా కీలక కార్యక్రమాలను రూపొందించడంలో నాగబాబు నేతృత్వంలోని ఈ కమిటీ అత్యంత కీలక పాత్ర పోషించనుంది.

## ప్రతిపక్షహోదా కోసం మారాం చేస్తున్న వైకాపా

మారాం చేస్తున్నట్టు ప్రతిపక్ష హోదా ఇస్తే వస్తామని అనడం హాస్యాస్పదమన్నారు. 1/70 యాక్ట్.. అంటే గిరిజనుల భూ సంరక్షణ చట్టం రద్దు అవుతుందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని.. గిరిజనుల భూములు, హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో గిరిజనులు ఏమాత్రం భయపడవద్దన్నారు. గిరిజనులను మభ్యపెట్టి, భయపెట్టి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఐటీడీఏ ఆపేసి, 18 పథకాలను నిలుపుదల చేశారని తెలిపారు. గురివిందకు తన తప్పు ఎరుగదు అన్నట్టు వైసీపీ నేతల తీరు ఉందని విమర్శించారు. జీవో నం 3 రద్దు చేస్తే అప్పుడు సీఎంగా జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన తాడేపల్లిలో ఉంటాడో బెంగళూరులో ఉంటాడో ఎవరికీ తెలియదంటూ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు.

## 16 ఏళ్ల వయసులో లక్ష్మణన్ సిఎ పూర్తి

పదహారేళ్ల వయసులో టీనేజర్లు తాము ఏ రంగాన్ని ఎంచుకోవాలో తెలియక మల్లగుల్లాలు పడుతుంటారు. కానీ ఓ భారతీయ టీనేజర్ మాత్రం తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవడమే కాకుండా అందులో గిన్నిస్ రికార్డు కూడా సృష్టించాడు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న లక్ష్మణన్ మేయప్పన్ అత్యంత పిన్నవయస్కుడైన సీఏగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తాజాగా చోటు సంపాదించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడికీ అరుదైన గుర్తింపు లభించింది. ప్రస్తుతం మేయప్పన్ సెంచరీ ÷నాన్షియల్ అనే సంస్థలో సీనియర్ ÷నాన్షియల్ రీసెర్చ్ ఎనలిస్టుగా ఉన్నాడు. అతడి అసాధారణ ప్రజ్ఞ గురించి కంపెనీ స్వయంగా ప్రకటించింది. కొవిడ్ సమయంలో అకౌంటింగ్‌పై మేయప్పన్‌కు మక్కువ ఏర్పడింది. స్వయంగా సీఏ అయిన అతడి తల్లి అకౌంటింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను తనయుడికి పరిచయం చేయడంతో ఆసక్తి ఏర్పడింది. దీంతో, తాను ఏసీసీఏ పరీక్షలు పాసై సీఏ కావాలని నిర్ణయించుకున్నాడు.

# ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో దళారులను నమ్మి మోసపోవద్దు

### ఎంప్లాయిమెంట్ సిల్క్ డెవలప్మెంట్ అధికారి ఏ సురేష్ కుమార్



**కడపబ్యూరో చీఫ్ ఆగస్టు 17 నంది పత్రిక** ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు మాత్రమే అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని ఉద్యోగ అవకాశాలను పొందాలని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎ. సురేష్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మి ఎవరూ డబ్బులు చెల్లించవద్దని ఆయన సూచించారు. ఉద్యోగాల పేరుతో కొంతమంది వ్యక్తులు నిరుద్యోగ యువతను మోసం చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్లు, అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ వంటి వివరాలను సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్లు మరియు అధికారిక ప్రకటనల ద్వారా మాత్రమే తెలుసుకోవాలని ఆయన సూచించారు.ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దు. దళారులకు డబ్బులు చెల్లించి మోసపోవద్దు. అధికారిక నోటిఫికేషన్ విడుదలైనప్పుడు మాత్రమే దరఖాస్తు చేసుకుని ఉద్యోగ అవకాశాలను పొందాలి"లిలి అని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీ ఎ. సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగే వారి సమాచారం ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

# దాగిన వాస్తవాలకు వెలుగే ‘కలం’

- సమాజ మార్పులో పాత్రికేయుల పాత్ర కీలకం
- ప్రజాస్వామ్యానికి పాత్రికేయులు వెన్నెముక
- పాత్రికేయుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం
- నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు
- ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**కర్నూలు, ఆగస్టు 17. నంది పత్రిక:** సమాజంలో ప్రజా సమస్యలు, లోపాలు, దాగిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం వెంకటరమణ కాలనీలోని కీర్తన అనాథశ్రణాలయంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ నిర్వహించిన 70వ ఆవిర్భావ దినోత్సవానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అంతకుముందు ఏపీయూడబ్ల్యూజే జెండాను సీనియర్ పాత్రికేయులు, ఎన్టీవీ స్టాఫ్ రిపోర్టర్ జీ చంద్ర శేఖర్ ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయులు వెన్నెముక లాంటి వారని, నిష్పక్షపాతంగా వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడం ద్వారా సమాజంలో చైతన్యం, మార్పుకు దోహదపడుతున్నారని కమిషనర్ అన్నారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ పరిధిలో ఉన్నవి తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి నగరపాలక సంస్థ తరఫున సాధ్యమైనంత వరకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అనాథ శరణాలయం చిన్నారులతో కలసి కేక్ కట్ చేసి, చిన్నారులకు తినిపించారు. అలాగే పిల్లలకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరంట్ల కొండప్ప, సీనియర్ జర్నలిస్ట్ జి.చంద్ర శేఖర్, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, మస్తాన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర రావు, మల్లికార్జున ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, సీనియర్ నాయకులు భాస్కర్, శ్రీనాథ్ రెడ్డి, సాగర్, రమేష్ రెడ్డి, సుధాకర్, పరమేష్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పట్టం

**యువతరం శివమెత్తితే - నవతరం గళమెత్తితే**
**లోకమే మారిపోదా! - చీకటే మాసిపోదా!**
**అన్నారు మహాకవి శ్రీశ్రీ.**

**యువత తలుచుకుంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. అభివృద్ధి అయినా, విధ్వంసం అయినా క్షణాల్లో జరిగి తీర వలసిందే.**



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 17:** మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు ( శ్రీ శ్రీ ) యువతరం గురించి మహాప్రస్థానంలో ప్రస్తావించిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని, విధ్వంసం అన్న మాటను పక్కనపెట్టి, విద్యారంగంలో ప్రతిభ కనపరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారిలోని ప్రతిభను గుర్తించి వారిని బండి ఆత్మకూరుకు చెందిన యువకులు కొందరు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. బండి ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001 వ సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ కి సంబంధించిన యువకులు ప్రస్తుతం హైదరాబాదు, బెంగళూరు, తదితర ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం వల్ల తాము ఈ స్థాయికి చేరుకున్నామని గుర్తించారు. స్వంత గ్రామంలో విద్యార్థులను ప్రోత్సహించాలని నిర్ణయించుకొని మిత్ర బృందమంతా ఒక నిర్ణయం తీసుకున్నారు. 2018 సంవత్సరంలో లక్ష రూపాయల మేర నిధిని ఏర్పాటు చేసి పోస్ట్ ఆఫీస్ లో జమ చేశారు. ఆ నిధి ద్వారా వచ్చే సొమ్ముతో ప్రతి ఏటా పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు కనపరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహం పేరుతో సన్మానించి సత్కరిస్తున్నారు. గత ఏడు సంవత్సరాల నుండి మిత్రబృందం ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో సమావేశాలు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించిన పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు వెండి పథకాలు బహూకరించడంతోపాటు ఘనంగా సత్కరిస్తున్నారు. ప్రస్తుతం వెండి ధరలు ప్రియం కావడంతో, నగదు రూపంలో విద్యార్థులకు ప్రోత్సాహకర బహుమతులు అందజేస్తున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకొని ప్రథమ ద్వితీయ తృతీయ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు రూపంలో అందించి సన్మానించారు. వీరిని ప్రోత్సహించడం వల్ల, తోటి విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకొని చదువులో రాణించే అవకాశం ఉంటుందని, తద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయి కి ఎదిగే అవకాశం ఉంటుందని భావిస్తారని మిత్ర బృందం పేర్కొంటూ ఉన్నారు. విద్యారంగంలో విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహిస్తున్న మిత్ర బృందాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో గ్రామాభివృద్ధి విషయంలో మరిన్ని ప్రయోజనకరమైన పనులను చేస్తారని ఆశిద్దాం.



# చుంచులూరులో ఘనంగా బస్సు షెల్టర్ ప్రారంభోత్సవం



**మర్రిపాడు ఆగస్టు 17నంది పత్రిక :** చుంచులూరు గ్రామంలో ప్రజల సౌకర్యార్థం నూతనంగా పునర్నిర్మించిన బస్సు షెల్టర్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించడం జరిగింది.చింతంరెడ్డి సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దాదాపు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన బస్సు షెల్టర్ కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది.దీంతో ప్రయాణికులు,ముఖ్యంగా వృద్ధులు,మహిళలు,విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉండే సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు.ఈ సమస్యను గుర్తించిన చింతంరెడ్డి సిద్ధారెడ్డి,చింతంరెడ్డి.సురేష్ కుమార్ రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి,పాత బస్సు షెల్టర్‌ను పునర్నిర్మించారు.ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఆధునిక సౌకర్యాలతో నూతన రూపంలో బస్సు షెల్టర్‌ను నిర్మించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమం గ్రామ ప్రజల సమక్షంలో ఎంతో వేడుకగా జరిగింది.చింతంరెడ్డి కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందిస్తూ,ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.షుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన బస్సు షెల్టర్‌ను అదే కుటుంబం తిరిగి పునర్నిర్మించడం పట్ల గ్రామస్తులు ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేస్తూ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చింతం రెడ్డి సిద్ధారెడ్డి,చింతం రెడ్డి సురేష్ కుమార్ రెడ్డి,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణం నూతన ప్రహరీ గోడ నిర్మాణం చేయాలి



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 17 . (నంది పత్రిక ):**భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ స్థానిక నంద్యాల పట్టణంలోని 15 వార్డులో ఉన్న గిరినాథ్ సెంటర్లో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణం పూర్తిస్థాయిగా నిర్వీర్యం అయింది. దీనివల్ల ఇక్కడ మద్యపానం పొగ తాగడం గంజాయి అసాంఘిక కార్యక్రమాలు ఇక్కడ జరుగుతున్నాయి.కావున జిల్లా కలెక్టర్ ఈ విషయాన్ని గుర్తించి వెంటనే పూర్తిస్థాయిగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.కాలేజీ చుట్టూ నూతన ప్రహరీ గోడ నిర్మాణం చేయాలి.విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.మత్తు మరియు మాదక ద్రవ్యాలను కాలేజీ ఆవరణలో పూర్తిస్థాయిగా నిషేధించాలి.కాలేజీ ఆవరణం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి ,కాలేజీకి మెయిన్ గేట్ దగ్గర నైట్ టైం ఒక సెక్యూరిటీ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సాయిరాం రెడ్డి , జిల్లా అధ్యక్షుడు, జై సింహా రెడ్డి జిల్లా కార్యదర్శి సురేంద్ర నాయక్, దేవానంద్ పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ సంక్షేమ పథకాలు బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

**పోరుమామిళ్ల, ఆగస్టు 17 (నంది పత్రిక):**అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ ఎస్టీ మంత్రులు ఎమ్మెల్యేలు గళం విప్పాలి ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ముత్యాల ప్రసాదు రావు పోరుమామిళ్ల ఆగస్టు 17 రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీల సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రంగాల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంలో పాటు ఏండ్లుగా పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారురాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం సమాన అవకాశాల స్ఫూర్తికి అనుగుణంగా ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను చేపట్టాలని ఆయన కోరారు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు ఎస్సీ ఎస్టీ మంత్రులు ఎమ్మెల్యేలు తమ వర్గ సమస్యలను బలంగా ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.



# అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచండి.

### కమిషనర్ ఎం. జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 17 నంది పత్రిక** నగరంలోని అన్నా క్యాంటీన్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం ఎమ్మార్ పల్లి వద్ద గల నగరంలోని అన్నా క్యాంటీన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలతో కలిసి అల్పాహారం స్వీకరించి, ఆహార నాణ్యతను పరిశీలించి ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీతమ్మ నగర్ రోడ్డు, ఎమ్మార్ పల్లి, న్యూ మారుతీ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, మంచినీళ్ళ కుంటను పరిశీలించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నా కాంటీన్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆహ్లాధాకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు ఆహార పదార్థాలు స్వీకరించేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. స్వచ్ఛమైన, శుభ్రమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. ప్లేట్లు, పాత్రలు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆహారం స్వీకరించే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు శుభ్రం చేయించాలని తెలిపారు. ఆహార పదార్థాలు వృధా చేయకుండా, తగినంత వడ్డించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, కాలువల్లో చెత్త లేకుండా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మంచినీళ్ళ కుంటను అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.



# ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

- రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి
- యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకాన్ని పునరుద్ధరించాలి
- హెల్త్ కార్డు అమలులో ఇబ్బంది లేకుండా చూడాలి
- జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి

**కర్నూలు, ఆగస్టు 17. నంది పత్రిక:**జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల ముందు మానిఫెస్టో లో పెట్టారని, కానీ ఇప్పటి వరకు దాని గురించి ఊసేలేదని, తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఇండియా జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, మస్తాన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర రావు, మల్లికార్జున డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే 70వ వార్షికోత్సవం పురస్కరించుకొని జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటించారు. సోమవారం పీజీఆర్ఎస్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్కింగు జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజేహెచ్ఎస్) అమలులో నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎదురవు తున్న ఇబ్బందుల వల్ల పలువురు జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేక పోతున్నారన్నారు. ప్రభుత్వం నుండి బకాయిలు ఉన్నాయన్న పేరుతో నెట్ వర్క్ ఆస్పత్రులలో డబ్ల్యూజేహెచ్ఎస్ కార్డును చాలా సందర్భాల్లో అనుమతించుట లేదన్నారు. కొన్ని ప్రాసెస్ లకు కూడా కార్డు వర్తించుట లేదన్నారు. ఇటువంటి లోటుపాట్లను సవరించి డబ్ల్యూజేహెచ్ఎస్ ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. పథకం అమల్లో ఎదురవుతున్న రోజువారీ సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్, , జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, తద్వారా జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని రెండేళ్లు గడిచిపోయిందని, ఇప్పటివరకూ ఈ విషయమై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. 2018-19 లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం ఆచరణలో అమలుకు నోచుకోలేదన్నారు. అందువల్ల మరింత జాప్యం లేకుండా ఇళ్ల స్థలాల విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి చేసిన సేవలకు గానీ, వేతనాలు గానీ, ఉద్యోగ విరమణ పింఛను గానీ లేని పరిస్థితులను, వారి వయసును దృష్టిలో ఉంచుకుని విశ్రాంత జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి వీలుగా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని ఏపీలో కూడా ప్రారంభించాలని కోరారు. జర్నలిస్టులపై పెరిగిపోతున్న భౌతిక దాడులు, బెదిరింపులు, దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రతకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, సీనియర్ నాయకులు భాస్కర్, శ్రీనాథ్ రెడ్డి, సాగర్, రమేష్ రెడ్డి, సుధాకర్, పరమేష్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకోండి





**సంతృప్తి స్థాయిలో ప్రజా సమస్యల వేదికలో**

**వచ్చిన అర్జీలపై పరిష్కారం చూపాలి**

**రీఓపెన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**పీజీఆర్ఎస్‌లో 307 ప్రజా వినతులు స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 17(నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజల నుంచి అందుతున్న వినతులను సకాలంలో, నాణ్యతతో సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి గణియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ( పీజీఆర్ ఎస్) అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందుతున్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సమస్యకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించి తీసుకున్న చర్యలను ఎండార్స్మెంట్ లో స్పష్టంగా తెలపాలన్నారు. నిర్దేశిత గడువులోగా నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వానికి తావు లేకుండా ప్రతి అర్జీపై బాధ్యతతో స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఈ దరఖాస్తులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి వారికి సరైన పరిష్కారం చూపాలి అన్నారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ లో భాగంగా పిజిఆర్ఎస్పై పైన ప్రజలకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. అలాగే అధికారుల లాగిన్‌లో ఇంకా పరిశీలించని దరఖాస్తులను పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలించి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల ద్వారా అందుతున్న వినతులపైనా ప్రత్యేక దృష్టి సారించి, సత్వర పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 167 దరఖాస్తుల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలోనే భూ సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 167 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. వాటిలో రెవెన్యూ, స్వర్ణ గ్రామ/వార్డులకు సంబంధించినవి 6, అడంగల్ సవరణలకు సంబంధించినవి 8, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22–ఎ భూములకు సంబంధించినవి 6, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 61, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 43, సర్వే, రీ–సర్వేలకు సంబంధించినవి 34, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 9 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు..వన్ మంత్ ఫోర్ విజిట్స్ కార్యక్రమాన్ని నందికొట్కూరు నియోజకవర్గం లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు..

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) గోస్పాడు మండలం, తెల్లపూరి గ్రామానికి పాశం వెంకటయ్య వృద్ధాప్య పింఛను మంజూరు చేయించగలరని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) దొర్నిపాడు మండలం, చాకరాజువేముల గ్రామానికి చెందిన పి.లక్ష్మిదేవికి అన్ని అర్హతలు ఉన్నపట్టికీ రైతు భరోసా పథకం క్రింద జమ అయ్యే నగదు జమ కాలేదని తగు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు

3) నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఎస్.పి.వై రెడ్డి మోడల్ కాలనీ, క్రాంతి నగర్, బొమ్మలసత్రం నివాసితులకు త్రాగు నీటి కొరత వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, మంచినీటి సదుపాయం పునరుద్ధరించగలరని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

# పికప్ ఆనకట్ట నుండి కుందూకు 500 క్యూసెక్కుల నీరు విడుదల



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 17:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సంత జూటూరు పికప్ ఆనకట్ట నుండి కుందూ నదికి 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. బానకచెర్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా విడుదలైన నీరు సోమవారం సంత జూటూరు పికప్ ఆనకట్టకు చేరుకుంది. ఆనకట్ట నుండి కుందూ నదికి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ కర్నూలు కడప కాల్వకు నీ టి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. గత రెండు నెలలుగా ఎల్లీనో ప్రభావం కారణంగా ఎలాంటి వర్షాలు కురియకపోవడంతో కుం దునది పూర్తిగా బోసిపోయింది. కుందు నదిలో నీరు లేకపోవడంతో పశువులకు త్రాగునీటితోపాటు, రజకులు సైతం ఇబ్బందులు పడ్డారు. కుందూ నదిని నమ్ముకొని చాలామంది నదీ పరివాహక ప్రాంతం వెంట డ్రై షోయింగ్ విధానంలో వరిని సాగు చేస్తూ ఉన్నారు. ప్రస్తుతం కుం దునదికి నీరు వచ్చి చేరడంతో రైతులు ప్రజలు ఆనందోత్సవాల్లో మునిగితేలుతున్నారు. ప్రజలకు త్రాగునీటి దృష్టిలో ఉంచుకొని సంత జూటూరు పికప్ ఆనకట్ట నుండి ఉయ్యాలవాడ మండలం వరకు నీటిని కెసి అధికారులు విడుదల చేస్తున్నారు. నాలుగు ఐదు రోజులపాటు వరకు పిక్ అప్ ఆనకట్ట నుండి కుందూ నదికి నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.



# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి.

**వెలుగోడు ఆగస్టు 17 నంది పత్రిక:** జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వము వెంటనే పరిష్కరించాలని వెలుగోడు జర్నలిస్టులు సోమవారము స్థానిక తాహసిల్దార్ శ్రీనివాసులు గౌడ్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎ.పి. యూనియన్ ఆఫ్ వర్కింగు జర్నలిస్ట్స్ 70 వ ఏట ప్రవేశించడం తెలుగు పత్రికా రంగ చరిత్రలో ఒక గర్వకారణమైన ఘట్టంగా అన్నారు.2026 ఆగస్ట్ 17 వ తేదీ నుండి ఏడాది పొడవునా ప్లాటినం జూబిలీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి మా యూనియన్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది.ప్లాటినం జూబిలీ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మాయూనియన్ పోరాట సంప్రదాయాన్ని అనుసరించి వర్కింగ్ జర్నలిస్టు పెండింగు సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలి. రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ అమలులో నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎదురవు తున్న ఇబ్బందుల వల్ల పలువురు జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేక పోతున్నారని ,ప్రభుత్వం నుండి బకాయిలు ఉన్నాయన్న పేరుతో నెట్ వర్క్ ఆస్పత్రులలో హెల్త్ కార్డును చాలా సందర్భాల్లో అనుమతించుట లేదన్నారు కొన్ని ప్రాసెస్ లకు కూడా కార్డు వర్తించుట లేదని , ఇటువంటి లోటుపాట్లను సవరించి జర్నలిస్టుల హెల్త్ కార్డును ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నాము. పథకం అమల్లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్, , జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలనీ, తద్వారా జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని కూటమి ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయ్యినా ,ఇప్పటివరకూ ఈ విషయమై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు.2018–19 లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం ఆచరణలో అమలుకు నోచుకోలేదు. అందువల్ల మరింత జాప్యం లేకుండా ఇళ్ల స్థలాల విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి చేసిన సేవలను, వారికి తగిన వేతనాలు గానీ, ఉద్యోగ విరమణ పింఛను గానీ లేని పరిస్థితులను, వారి వయసును దృష్టిలో ఉంచుకుని విశ్రాంత జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి వీలుగా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభించాలని కోరుతున్నాము. జర్నలిస్టులపై పెరిగిపోతున్న భౌతిక దాడులు, బెదిరింపులు, దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రతకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో వెలుగోడు జర్నలిస్టులు రఘు రాముడు, చంద్ర శేఖర్ , షాబీర్ హుస్సేన్, లింకన్ రాజు , శివశంకర్ , నాజిర్, నూరుల్లా పాల్గొన్నారు.




## డి.ఎస్.పి .ఆర్ రామాంజ నాయక్ కి శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి నాయకులు



**నంది పత్రిక ఆత్మకూరు..** 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ సేవ అవార్డు అందుకున్న ఆత్మకూర్ డి.ఎస్.పి ఆర్. రామాంజినాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు::: సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్ధిన్.లి ఈరోజు ఆత్మకూర్ డి.ఎస్.పి ఆఫీస్ నందు ఆత్మకూర్ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్ , క్లస్టర్ ఇంచార్జ్ లు రాజారెడ్డి మరియు దినకర్ రావు తో కలిసి డీఎస్పీ ఆర్. రామంజి నాయక్ శుభాకాంక్షలు తెలియజేసిన ఆత్మకూర్ సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్ధిన్. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా, కుల,మత భేదాలు లేకుండా, పేద ,ధనిక అనే తేడా లేకుండా ప్రజలకు న్యాయం చేయడమే కాకుండా ,డివిజన్ పరిధిలో శాంతి భద్రత పరి రక్షణే పరమావధిగా భావించి పనిచేసే ఆత్మకూర్ డిఎస్పి రామంజి నాయక్ ఉత్తమ సేవ పురస్కార అవార్డు అందుకోవడం చాలా సంతోషకరమని, భవిష్యత్తులోనూ మరెన్నో ఉత్తమ సేవ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## పీజీఆర్ఎస్‌పై ప్రజల్లో సానుకూల స్పందన పెంపొందించాలి..!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 17 నంది పత్రిక** : ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో నమ్మకాన్ని, సానుకూల స్పందనను పెంపొందించాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధి మీనా తోకలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో పెండెన్సీ పై అధికారులతో జిల్లా కలెక్టర్ సుమీక్షించారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ బాధ్య అధికారులు పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు.. సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజల్లో పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ విషయంలో తహసీల్దార్లు, శాఖాధిపతులు ఎల్లపుడు పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు సమాచారం అందిపుచ్చుకునేలా అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–ఆఫీస్ విధానాన్ని ఖచ్చితంగా అమలయ్యేలా సంబంధిత శాఖల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని శాఖలు జిల్లా స్థాయి కార్యాలయం నుండి మండల, గ్రామ స్థాయి కార్యాలయాల వరకు.. అఫీషియల్ కరస్పాండెన్స్, ఉత్తర ప్రత్యుత్తరాలు, జీవోలు, మెమోలు, అన్ని రకాల కార్యకలాపాలకు సంబంధించి ప్రతి డాక్యుమెంట్ ను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు, ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జిల్లా ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇందుకోసం నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# “నంద్యాల ప్రజలతో మమేకమవుతున్న టీడీపీ








## ఇంటింటికీ చేరుతున్న సంక్షేమ పథకాలు ఎన్ .ఎం.డి.ఫిరోజ్“

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 17 ( నంది పత్రిక )** ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా నంద్యాల నియోజకవర్గంలోని 18వ వార్డు ఎన్‌జీఓస్ కాలనీలో వార్డు నాయకులు శ్రీకాంత్ నాయుడు , తోట రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.లి ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని తెలిపారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు ‘తల్లికి వందనం’ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతోందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పెంచి లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందిస్తున్నామని, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు.మహిళలకు ఉచిత గ్యాస్ సబ్సిడీ, రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు అందుతున్నాయని, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని వివరించారు.

రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నామని, దేశవిదేశీ పెట్టుబడిదారులు ముందుకు వస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఏ వార్డుకు, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు చూపిస్తున్న ఆత్మీయత, ఆదరణ ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనం” అని ఫిరోజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,రాంపల్లి రామిరెడ్డి బొట్టు వెంకటేష్ కృష్ణమాచార్యులు లింగారెడ్డి దామోదర్ సత్తార్ తిరుపాల్ దామోదర్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ గోవిందా నాయుడు, ఉప్పరి సురేష్ కుమార్, షేక్ అజ్మీర్, హీదాయతుల్లా ఖాన్, ఖాజా ,కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు



# హజ్ -2027 కు విమాన రాకపోకల తేదీలు ఖరారు

**ఇమాములు,మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.22.50 కోట్లు విడుదల**

**మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి, ఆగస్టు17. నంది పత్రిక:**పవిత్ర హజ్ యాత్ర -2027 కోసం సౌదీ అరేబియాకు విమానాల రాకపోకల తేదీలు ఖరారు అయినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 8వ తేదీ నుండి ప్రారంభమై , మే 9వ తేదీవరకు ఇండియా నుండి సౌదీకి విమానాలు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. సౌదీ నుండి ఇండియా కు మే 21వ తేదీ నుండి జూన్ 20 వ తేదీవరకు తిరుగు ప్రయాణపు విమానాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతానికి విమాన రాకపోకల తేదీలు ఖరారు అయ్యాయని, ఏ ఏ ఎంబార్కేషన్ కేంద్రాల నుండి ఏ ఏ తేదీన విమానాలు వెళతాయి అన్న వివరాల నిర్ధారణ ఇంకా ఖరారు కాలేదన్నారు. ఖరారు అయిన వెంటనే బహిరంగ ప్రకటన ద్వారా హాజీలకు ఈ సమాచారాన్ని మైనారిటీ మంత్రిత్వ శాఖ ద్వారా చేరవేయడం జరుగుతుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా వచ్చే ఏడాది హజ్ యాత్ర కోసం 2830 మంది యాత్రికులు ఏపీ నుంచి దరఖాస్తు చేసుకోగా,2792 మంది ఎంపికయ్యారని, వీరిలో 460 మంది షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మంత్రి మరోసారి గుర్తు చేశారు. విజయవాడ ఏంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కు వెళ్లేందుకు 637 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంచుకున్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, ఏర్పాట్ల ను పగడ్బందీగా చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.లి

**ఇమాములు,మౌజన్ల గౌరవ వేతనాలకు రూ. 22.50 కోట్లు విడుదల** రాష్ట్రంలోని 10000 మంది ఇమాములు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపు కోసం కూటమి ప్రభుత్వం రూ. 22.50 కోట్లు విడుదల చేసిందని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.

ప్రస్తుత ఏడాది ఏప్రిల్,మే,జూన్ లకు సంబంధించి మూడు నెలలకు గాను గౌరవ వేతనాల చెల్లింపు కోసం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇమాములకు రూ.10,000, మౌజన్ల కు రూ. 5,000 ప్రకారం మూడు నెలలకు సంబంధించిన మొత్తాన్ని సంబంధిత మసీదు కమిటీల బ్యాంక్ అకౌంట్లకు నేరుగా జమ చేసే ప్రక్రియ త్వరలో పూర్తి అవుతుందని మంత్రి పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తూనే, వారికి ఇచ్చిన హామీలన్నింటిని కార్యాచరణ బద్ధంగా నెరవేర్చడం కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

# యోరుషలేము చర్చిలో బిషప్ ఆర్ సి విజయరాజు అధినేత ప్రార్థన కూడిక



**నంది పత్రిక ఆత్మకూరు..** ఆత్మకూరు మున్సిపాలిటీలో నీ దుద్యాల రోడ్డు లో నవత ట్రాన్స్పోర్ట్ వద్ద ఈ రోజున కౌన్సిల్ ఆఫ్ రెఫర్మ్ ఆఫ్ ఇండియా చర్చి సి ఆర్ సి ఐ / ఏపీ/ సి ఎస్ 10 యో రుషలేము ప్రార్థన మందిరంలో రెవరెండ్ డాక్టర్ పాస్టర్ ప్రకాశరావు. రెవరెండ్ కె జయ రాణి గార్ల ఆధ్వర్యంలో ప్రార్థన కూడిక జరిగినాయి ఈ ప్రార్థన కూడికలకు ముఖ్య అతిథిగా బిషప్ ఆర్ సి విజయరాజు అధినేత హాజరై ప్రార్థన కూడిక విజయవంతంగా జరిగినాయి ప్రార్థన కూడికల ముఖ్య సారాంశం ఏమనగా వారి పాస్టర్లకి ఆ సంఘము యొక్క సిద్ధాంతాలు చర్చి నిర్మాణాలు మరియు ఎల్ ని నో ప్రభావంతో మన రాష్ట్రంలో వర్షాలు పడక రైతులు రైతు కూలీలు ప్రజలు ఎంతగానో ఇబ్బందులకు గురవుతున్నారు ఎల్ ని నో ప్రభావం తొలగిపోయి సకాలంలో వర్షాలు పడి పంటలు పండి రైతులు ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలా దేవుడా అని ప్రార్థించడం జరిగింది ఈ ప్రార్థన కూడికలో యోరుషలేము ప్రార్థన మందిరం సంఘస్తులు మరియు వేరే సంఘాల సంఘస్తులు కూడిక ప్రార్థనలో పాల్గొని ప్రార్థించడం జరిగింది

# మెగా యూత్ ఫోర్స్ శ్రీశైలం కన్వీనర్ గా మారెడ్డి రామయ్య



**మహానంది, ఆగస్టు 17 (నంది పత్రిక):-** మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన మారెడ్డి రామయ్య మెగా యూత్ ఫోర్స్ శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ గా నియమితులయ్యారు. సోమవారం ఆయన మాట్లాడారు..తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు తన వంతుగా కృషి చేస్తానన్నారు.ఈ పదవి రావడానికి సహకరించిన సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి కుమార్తె కొణిదెల సుస్మితకి కృతజ్ఞతలు తెలిపారు.మెగా అభిమానులను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తానన్నారు. ఇంతటి మహత్తర బాధ్యతను అప్పగించిన మెగా ఫ్యామిలీకి, జనసేన పార్టీ అధినాయకత్వానికి పేరుపేరునా హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మెగాస్టార్ చిరంజీవి చూపిన సేవా మార్గంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. మెగా ఫ్యామిలీ అభిమానులను, యువతను ఒకతాటిపైకి తెచ్చి శ్రీశైలం నియోజకవర్గంలో సామాజిక, సేవా కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తాం అన్నారు. కష్టాల్లో ఉన్న ప్రతి పేదవాడికి మెగా యూత్ ఫోర్స్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# యర్రగుంట్ల మేజర్ గ్రామంలోని 121 బూత్ లోని ఎస్సీ కాలనీలో ఇంటింటికి తెలుగుదేశం



**శిరివెళ్ల (నంది పత్రిక):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామంలోని 121 బూత్ లోని వాజ కాలనీలో నీటి సంఘం అధ్యక్షుడు కమతం లక్ష్మిరెడ్డి, కమతం పుల్లారెడ్డి, డీలర్ హుస్సేన్ ప్ప, మెంబర్ లింగమయ్య, టిడిపి యూత్ లీడర్ ఎదుర్ల నాగ సురేష్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రముఖులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గత రెండేళ్ల కాలంలో ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ గారు చేసినటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. 121 బూత్ లో ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధి సంక్షేమాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావడంతో 121 బూత్ పసుపు భయంగా మారింది. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర టిడిపి నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బేతంచర్ల నగర పంచాయతీ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం.



**బేతంచెర్ల ఆగస్టు 17( నంది పత్రిక ).** బేతంచర్ల నగర పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, తమ ఉత్తమ సేవలకు గాను, నంద్యాల జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్ చేతుల మీదుగా "ఉత్తమ ఉద్యోగి" అవార్డును అందు కోవడంతో,నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ అవార్డు గ్రహీతలు అగు,సీనియర్ అకౌంటెంట్ సురేఖ,అసిస్టెంట్ ఇంజనీర్ మధుతేజ,సానిటరీ ఇన్స్పెక్టర్ మధు,మెప్మా కోఆర్డినర్ ఇద్రూస్ భాష అలాగే ఎపి. గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్ నాగరాజును సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగులు నికిష్టంగా, బాధ్యతా యుతంగా పనిచేసి, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం నగర పంచాయతీకి ఎంతో గర్వకారణం.ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా, ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలి అని తెలియజేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు, కార్యాలయ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొని అవార్డు పొందిన ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

# రిజర్వేషన్ల ప్రక్రియకు ప్రభుత్వం కసరత్తు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 17 :** రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తూ ఉంది. రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు గాను ఎస్టీ బీసీ ఎస్సీలను గుర్తించేందుకుగాను ప్రభుత్వం సిద్ధమవుతూ ఉంది. రాష్ట్రస్థాయి అధికారుల నుండి వచ్చిన ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శిలకు సమావేశం నిర్వహించి ఈ విషయంపై దిశ నిర్దేశం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సహాయకుల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు మంగళవారం నాటి నుండి గ్రామాలలో పర్యటించి ఎస్సీ ఎస్టీ బీసీలను గుర్తించాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించి సవరించే చర్యలు చేపట్టాలని అన్నారు. సెప్టెంబర్ 3 నుండి 7వ తేదీ వరకు ఆయా సచివాలయ పరిధిలో గ్రామసభలు నిర్వహించి ఓటర్లను గుర్తించాలని అధికారులు పేర్కొన్నట్లుగా సమాచారం. ఓటర్లకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలు జరిగే ముందే వాటిని గుర్తించాలని అధికారులు సూచించినట్లుగా తెలుస్తోంది.

# తెలంగాణ ఓటర్ల జాబితా

తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) 2026కు సంబంధించిన ముసాయిదా జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన వారు ఫారం-6 ద్వారా తిరిగి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు అందాయని, ఇది మొత్తం ఓటర్లలో 78.30 శాతమని అధికారులు వెల్లడించారు. వీరిలో అధిక శాతం ఓటర్లను ఏఎస్‌డీడీ (గైర్హాజరు, చిరునామా మార్పు, మృతి, డూప్లికేట్) కేటగిరీ కింద చేర్చారు. శాశ్వతంగా చిరునామా మారిన వారు, అందుబాటులో లేని వారు, మరణించిన వారు, వేర్వేరు చోట్ల ఓటు హక్కు ఉన్న వారు కలిపి మొత్తం 73,39,235 మంది ఈ కేటగిరీలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటింటి సర్వే చేపట్టిన సమయంలో బూత్ స్థాయి అధికారులు ఈ వివరాలను సేకరించారు.

# టిడిపి నాయకులు కడితం బాలిరెడ్డి భౌతికకాయానికి కోట్ల సుజాతమ్మ నివాళులు



**నందిపత్రిక -ప్యాపిలి** తెలుగుదేశం పార్టీ నాయకులు కడితం బాలిరెడ్డి అనారోగ్య కారణాలతో హఠాన్మరణం చెందడం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డోన్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యురాలు కోట్ల సుజాతమ్మ ప్యాపిలిలోని మృతుని నివాసానికి చేరుకుని, కడితం బాలిరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ లోతైన సానుభూతిని తెలిపారు. కష్టసమయంలో కడితం కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆమె ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో గడ్డం అంకిరెడ్డి, మైనారిటీ నాయకులు ఖాజా పీర్, సీమ సుధాకర్ రెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, చల్లా అనుదీప్ కుమార్, బంకు నాగేంద్ర, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ ధ్యేయమే కూటమి ప్రభుత్వం లక్ష్యం



**మహానంది ఆగస్టు 17 (నంది పత్రిక):-** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రజా పరిపాలన సాగిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు కంచర్ల శివశంకర్ చౌదరి, మహానంది దేవస్థానం చైర్మన్ నరాల చంద్ర మౌళీశ్వర్ రెడ్డి అన్నారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి-సంక్షేమం' కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇందులో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు వై.బాబు తదితరులు పాల్గొని ప్రభుత్వ విజయాలను వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు కేఈ కిరణ్ కుమార్ గౌడ్,జనసేన నాయకులు చక్రపాణి, పిన్నా కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు కదిరి రమణ గౌడ్, బోడెద్దుల ఆంజనేయులు, పోలిశెట్టి సురేంద్ర, కే.మోహన్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలి...!




**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**పెండింగ్ భూసేకరణ, పరిహారం,**

**అవార్డులను త్వరితగతిన పూర్తి చేయాలి**

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 17: నంది పత్రిక** జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నీటిపారుదల, జాతీయ రహదారులు, రైల్వే, సౌర విద్యుత్, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. వైఎస్సార్ జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన రెవెన్యూ అంశాలు, భూసేకరణ పురోగతిపై.. సంబంధిత అధికారులతో విసి ద్వారా సమీక్షించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డీఆర్వో మల్లికార్జునుడు, ఆర్డీవోలు, సంబంధిత ప్రాజెక్టుల డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ కీలకమైనందున పెండింగ్ అవార్డులు, పరిహారం, ప్రతిపాదనలు, భూమి అప్పగింతలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అన్ని ప్రాజెక్టులు అత్యంత ప్రాధాన్యత కలిగినవని, భూసేకరణ, పరిహారం, అవార్డులు, రెవెన్యూ సంబంధిత ప్రక్రియలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాధారణ రెవెన్యూ విధులతో పాటు ప్రతిరోజూ కొంత సమయం ప్రాజెక్టుల పనులకు కేటాయించి, ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. భూసేకరణను క్రమపద్ధతిలో, నిబద్ధతతో చేపడితే సులభంగా పూర్తి చేయవచ్చన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన 1,34,938.63 ఎకరాల్లో 1,19,433.995 ఎకరాలు ఇప్పటికే సేకరించగా, ఇంకా పెండింగ్ లో ఉన్న భూసేకరణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సోమశిల, తెలుగు గంగ, జీఎన్ఎస్ఎస్‌హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్, కుందూ - పెన్నా, గండికోట, రాజోలి తదితర ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించి 1,635.42 హెక్టార్ల భూమి సేకరణ నమోదైందని, అందుకు సంబంధించి దాదాపు 90% పరిహారం కూడా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన పరిహారం, అదనపు భూసేకరణ, అవార్డు ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రాజంపేటరాయచోటి, ఒంటిమిట్ట ప్రాంతాల్లో రహదారి రూపకల్పనపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, ప్రజలకు సౌకర్యవంతంగా పనులు చేపట్టాలని సూచించారు.కడప, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్లలో రహదారులు, వంతెనలు, పారిశ్రామిక ప్రాంతాలు, రైల్వే మార్గాలు, జల జీవన్ మిషన్ తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణను కూడా సమీక్షించారు. అలాగే 7 మురుగునీటి శుద్ధి కేంద్రాలకు అవసరమైన 7.18 ఎకరాల భూమి సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన 1,233.96 ఎకరాల భూమి భూసేకరణ, లీజు ప్రక్రియను పరిశీలించి, పెండింగ్ ప్రతిపాదనలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు, విద్యుదీకరణ, బైపాస్ లైన్, మూడోనాలుగో రైల్వే లైన్లకు సంబంధించిన భూసేకరణ పురోగతిని కూడా సమీక్షించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, పెండింగ్ ప్రతిపాదనలు, పరిహారం, అవార్డులు, భూసేకరణ ప్రక్రియలను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ సంబందిత అధికారులను ఆదేశించారు. .



# ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రోగులకు బ్రెడ్ పండ్ల పంపిణీ.

**ఏపీ యూ డబ్ల్యు జె జర్నలిస్టుల సమస్య లు ఎన్డీఏ ప్రభుత్వము ఇచ్చిన హామీల కొరకు ఆర్డీవో కె వెంకట శివ కు మెమరాండం**

**నంది పత్రిక ఆత్మకూరు..** సోమవారం ఏపీయూడబ్ల్యూజే 70 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నందు ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆత్మకూరు తాలూకా కమిటీ నాయకుల ఆధ్వర్యంలో రోగులకు యాపిల్ పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు అనంతరం జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు బెదిరింపులు తోపాటు జర్నలిస్టుల సమస్యలపై ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే.వెంకట శివ కు ఏపీయూడబ్ల్యూజే యూనియన్ జిల్లా ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు గద్ద శ్యామ్ ఎలక్ట్రానిక్ మీడియా శివ గౌడు, ఉపాధ్యక్షుడు దుద్యాల చంద్రయ్య, జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు, సగినేల రవికుమార్, ఆత్మకూరు తాలూకా కమిటీ ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కమతం వెంకటకృష్ణ, ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్షుడు ఎస్ కే సైబుద్దిన్ ల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు



# 15వ వార్డు గోపాల్ నగర్‌లో ఘనంగా 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం





## కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆదరణ

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 17 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు నేరుగా అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి స్పష్టం చేశారు. నంద్యాల నియోజకవర్గంలోని 15వ వార్డు పరిధిలోని గోపాల్ నగర్‌లో వార్డు నాయకులు ఎబినేజర్, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌ఎండి ఫిరోజ్, నారాయణ స్వామి పార్టీ శ్రేణులతో కలిసి ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్‌ఎండి ఫిరోజ్ ,నారాయణ స్వామి మాట్లాడుతూ కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతోందని అన్నారు . పెంచిన పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి గౌరవప్రదంగా అందిస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆకలి తీర్చేందుకు నాణ్యమైన భోజనాన్ని అన్న క్యాంటీన్ల ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీతో పాటు, 'స్త్రీ శక్తి' పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ఆర్థిక చేయూతనిస్తున్నామని. రాష్ట్రంలో పరిశ్రమలు, దేశ-విదేశీ పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నామని, తద్వారా రాబోయే రోజుల్లో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఏ వార్డుకు, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు చూపుతున్న ఆత్మీయత, మద్దతు కూటమి ప్రభుత్వంపై ఉన్న తిరుగులేని నమ్మకానికి నిదర్శనమని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఎబినేజర్, నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు ఏవిఆర్ ప్రసాద్, దేవరపాటి రవికుమార్, అజ్మీర్, జిల్లెల్ల శ్రీరాములు, షేక్ మహమ్మద్ రఫీ (మున్నా), జోసఫ్, రవి, కరీం, అక్రమ్, సుబ్బయ్య, కాజా శంకర్, ముత్యాల ప్రభాకర్, కాజా మొహిద్దిన్ , మనోజ్ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పి జి ఆర్ ఎస్ లో అందిన ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయమైన పరిష్కారం చూపాలి





## జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 17 నందిపత్రిక**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి. జి .ఆర్ ఎస్) లో ప్రజల నుండి స్వీకరించిన ప్రతి అర్జీని నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ తో పాటు డి ఆర్ ఓ పి. ప్రభాకర్ ,పిజిఆర్ఎస్ జిల్లా ప్రత్యేక అధికారి వై దోసిరెడ్డి డ్వామా పిడి డా. కె సి హెచ్ అప్పారావు, కలెక్టరేట్ ఏవో ఎన్ వెంకటేశ్వరరావు కలసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పలు ప్రాంతంలో నుండి వచ్చిన ప్రజల నుండి పి జి ఆర్ ఎస్ 163 రెవెన్యూ క్లినిక్ సంబంధించినవి 50 మొత్తం 213 ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందన్నారు. పి జి ఆర్ ఎస్ లో అందిన ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయమైన పరిష్కారం చూపాలని అన్నారు. ఫిర్యాదుదారుడు పెట్టుకున్న అర్జీ సంబంధిత శాఖకు కాకపోతే ఏ శాఖకు సంబంధించింది ఖచ్చితమైన విచారణ ఫిర్యాదుదారునికి తెలియజేయాలని సూచించారు ఫిర్యాదుల పరిష్కారం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నందున సమస్యల పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ మాట్లాడుతూ పి. జి. ఆర్. ఎస్ లో స్వీకరించిన ఫిర్యాదులు

గడువు పూర్తయినప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ముఖ్యంగా రెవెన్యూ, సర్వే, ఫిషరీస్, మున్సిపల్ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు అధిక సంఖ్యలో గడువు దాటిన నేపథ్యంలో ప్రతి కేసును పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. వ్యవసాయ భూముల మార్పులు, సరిహద్దుల నిర్ధారణ వంటి అంశాల్లో ఇతర రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నడక దారులు, సాగునీటి ప్రవాహాలకు ఆటంకం లేకుండా తగిన అనుమతులు, పరిష్కారాలు కల్పించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదుదారుకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తిస్థాయి లో సాగునీరు అందించాలని మరియ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని భీమవరం నుండి సిపిఐ జిల్లా కార్యదర్శి కోనల భీమారావు తదితరులు కోరారు. మొగల్తూరు మండలం పాత కాలువ సెంటర్ నుండి పొన్నపల్లి కళావతి 63 సంవత్సరాలు ఆర్ఎస్ నెంబర్ 708/1సి స్థలంలో రేకుల షెడ్డు వేసుకుని నివాసం ఉంటున్నాను నా గృహం సమీపంలో పాము ప్రభాకర్ రావు పాము శ్రీధర్ అను వారిద్దరూ ఆర్ అండ్ బి రోడ్డు స్థలము ఆక్రమించి అరటిపళ్ళు దుకాణం ,షోడా కొట్టు నిర్మించి నడుపు చున్నారు. వాటి నుండి వచ్చే వ్యర్థ పదార్థాలన్నీ మా ఇంటి ముందు పాడవేస్తున్నారు. అడుగ మాపై దౌర్జన్యం చేస్తున్నారు వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. పాలకొల్లు మండలం ఆగరు గ్రామం నుండి కొయ్యే కమల కుమారి తన మనవడు కొయ్యే కార్తీక్ 17 సంవత్సరములు వయస్సు తల్లి లేదు పుట్టికతో పోలియో అంగ వైకల్యంతో బాధపడుతున్నాడు ప్రభుత్వం ఇస్తున్న రూ.6 వేలు పెన్షన్ కు బదులు

**రూ.15 వేలు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.**

పెనుమంట్ర మండలం మల్లెపూడి గ్రామం నుండి కంకిపాటి నరసయ్య విభిన్న ప్రతిభావంతుడు ప్రభుత్వం నుండి మూడు చక్రముల ఎలక్ట్రికల్ వాహనం (స్కూటర్) మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం తరపున వయోవృద్ధులు సంఘాలను ఏర్పాటు చేసి నూతనముగా ఏర్పాటు చేసి జిల్లాలలో వయోవృద్ధులు మరియు విన్న ప్రతిభావంతులు సంస్థలను ఏర్పాటు చేయాలని వయోవృద్ధులు సభ్యులు మేళం దుర్గాప్రసాద్, చిట్టి వెంకయ్య, కరుణాకర్ చౌదరి, గాంధీ, రఘు తదితరులు కోరారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు వయోవృద్ధుల సంక్షేమం ట్రిబునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

.



## రాపిడో, ఓలా వంటి యాప్ లను ఎత్తివేయాలి

### -టీయూసీఐలి ఆంధ్ర ప్రదేశ్ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్




**కర్నూలు ప్రతినిధి. ఆగస్టు 17 . (నంది పత్రిక ):**రాపిడో, ఓలా వంటి యాప్ ఆధారిత రవాణా సేవల వల్ల ఆటో కార్మికుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోందని టీయూసీఐ ( ఆంధ్ర ప్రదేశ్ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్స్ వర్కర్స్ యూనియన్)టి యు సి ఐ కర్నూల్ నగర అధ్యక్షులు కే రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .స్థానిక కర్నూలు నగరంలో టియుసిఐ కార్యాలయం నందు ఆటో కార్మికుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా టి యు సి ఐ నగర అధ్యక్షుడు కే రాజు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అన్యాయమైన పోటీకి కారణమవుతున్న యాప్ ఆధారిత సేవలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ నగర అధ్యక్షులు కే రాజు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆటో లను నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులపై రాపిడో, ఓలా వంటి సంస్థల ప్రభావం తీవ్రంగా పడిందన్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలని కోరారు. యాప్ ఆధారిత రవాణా సేవలపై సమగ్ర పరిశీలన జరిపి, స్థానిక ఆటో కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రుణాలు, బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు, రంగడు శేఖరు కే ఈరన్న మధు రాజేష్ శ్యామ్ రాజ్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## ఆలయ పూజారిని ఏర్పాటు చేయాలి...



**చాగలమర్రి ఆగస్టు 17 నంది పత్రిక** మండల పరిధిలోని ముత్యాలపాడు తండా కు చెందిన మారమ్మ సేవాదళ్ ఆలయానికి ప్రభుత్వం పూజారిని ఏర్పాటు చేసి, వేతనం కూడా మంజూరు చేయాలని కోరుతూ చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసిల్దార్ కు ఎంతాండ గ్రామస్తులు శివరామ నాయక్, వెంకట్ రామ్ నాయక్, మంగే నాయక్, రామదాసు నాయక్, లక్ష్మీ రామ్ నాయక్, స్వామి నాయక్ మరి కొంతమంది వినతి పత్రం అందజేశారు. గిరిజన బంజారా ( సుగాలి) ఎస్టి కుల గ్రామదేవత మారమ్మ దేవాలయానికి ధూప దీప నైవేద్యం ద్వారా నిర్వహించుటకు పూజారిని ఏర్పాటు చేయాలని కోరారు. సాంప్రదాయ బద్ధంగా జరుపుకుంటున్న ఉత్సవాలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. పూజారి ఏర్పాటుకు దేవదాయ శాఖకు సిఫారసు చేయాలని గ్రామస్తులు విన్నవించారు.

## తాత్కాలిక ఉపాధ్యాయుల కోసం దరఖాస్తు చేసుకోండి .



**చాగలమర్రి ఆగష్టు 17 నంది పత్రిక** చాగలమర్రి మండలంలోని పెద్ద బోధనం 1, పెద్ద బోధనం హై స్కూల్ 1, చిన్న బోధనం 1, తోడేండ్లపల్లె 1, ముత్యాలపాడు1, ముత్యాలపాడు తాండ 2, డి వనిపెంట 1 లలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా, జడ్పీహెచ్ఎస్ చాగలమర్రి నందు ఉర్దూ మీడియం భౌతిక శాస్త్రము, జీవశాస్త్రము మరియు ఉర్దూ భాష లలో ఒక్కొక్క స్కూల్ అసిస్టెంట్ పోస్టు మరియు తెలుగు మీడియంలో భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నది. జడ్పీహెచ్ఎస్ చింతలచెరువు నందు హిందీ పోస్టు కలదు. జడ్పీహెచ్ఎస్ చిన్న వంగలి నందు ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా కలదు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు తో పాటు వారి విద్యార్హతల నకలు సర్టిఫికెట్లను జతచేసి ఈ నెల 21వ తేదీ లోపు చాగలమర్రి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయము నందు అందజేయవలయును. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన వారికి నెలకు 10వేలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికైన వారికి నెలకు 12,500 చెల్లించబడును అని ఎంఈఓ లు శేషశయనా రెడ్డి, న్యామతుల్లా తెలియజేశారు.

## కుందూ నది నీటి కాలుష్యాన్ని అరికట్టండి

### కలెక్టర్ కు అర్జీ ఇచ్చిన వైసీపీ నాయకులు







**కోవెలకుంట్ల ఆగష్టు 17నందిపత్రిక** ఏర్పడిన ఎల్ నినో వర్షా భావంతో కుందూనది ఎండిపోయింది. అయితే ఉన్న జలధార నీళ్లు కూడా పై నుండి వస్తున్న కలుషితంతో ప్రజలను అనారోగ్యం పలుజేస్తూ ఉండగా మత్య సంపద అంతరించి పోతుందని వైసీపీ నాయకలు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం వారి నాయకుడు మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి సూచన మేరకు సమస్య పై జిల్లా కలెక్టర్ కు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోలదోరాసి గ్రామం లోని కుందు నది నీరు కలుషితం కావటం తో నది లోని చేపలు చనిపోయి నీరు దుర్వాసన రావటం వల్ల ప్రజలు తాగునీరు మరియు రోజువారి అవసరాల కోసం చాలా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అధికారులను కలిసి ఆర్జి ఇచ్చి సమస్య త్వరగా పరిస్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోలదోరాసి గ్రామ ప్రజలు వైఎస్ఆర్సిపి నాయకులు పోతం రామ మోహన్ రెడ్డి, ఈర్నపాటి ఉప్పరి సుబ్బరాయుడు, పోతం రాజేష్ రెడ్డి, రామ సుబ్బరాయుడు, నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## నెల రోజులుగా తెరుచుకోని గ్రామపంచాయతీ..

### వెనుదిరికి వెళుతున్న అర్జీదారులు



**శిరివెళ్ల : (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డి పల్లె గ్రామపంచాయతీ కార్యాలయం సుమారు నెలరోజులు కావస్తున్న తాళం వేసిన తలుపులు తెరుచుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి స్కాలర్షిప్ల ఇతర బ్యాంకు విత్ డ్రా లు కోసం సంతకాల అవసరాల నిమిత్తం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వస్తూ అధికారులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగి వెళుతున్నారని గ్రామ ప్రజలు తెలియజేశారు. రెగ్యులర్ కార్యదర్శి సెలవుల్లో వెళ్లారని ఇన్చార్జి కార్యదర్శి అసలు రావడం మానేశారని మండల స్థాయి అధికారులు స్పందించి సక్రమంగా విధులు నిర్వహించే కార్యదర్శులను తమ గ్రామానికి ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఓటర్ల సర్వే కులాల వారీగా ఓటర్ల జాబితా తయారీ ఇతర సర్వేలు జరుగుతుంటే తమ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న చిరు వర్షాలకు అక్కడక్కడ సాగు అవుతున్న మాగాని పంటలకు దోమలు ఉత్పత్తి అవుతున్నాయని అంటువ్యాధులు ప్రబలకుండా తగిన సూచనలు సలహాలు అందించాల్సిన సమయంలో గ్రామ కార్యదర్శి లేకపోవడం పట్ల పలువురు పలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో మరియు డిఎల్పిఓ వంటి అధికారులు స్పందించి గ్రామ కార్యదర్శి సక్రమంగా విధులు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని వీరారెడ్డిపల్లె గ్రామపంచాయతీ ప్రజలు కోరారు.

# పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన అర్జీలు పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులుపై చర్యలు తప్పవు.





### ఫిర్యాదుదారులు వద్ద స్నేహపూరిత వాతావరణంలో ఫిర్యాదులు స్వీకరించారు. దివ్యాంగులు చెంతకు వెళ్ళి అర్జీలను స్వీకరించన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...

**ఏలూరు బ్యూరో చీఫ్ , ఆగస్టు 17 నంది పత్రిక:** జిల్లా కలెక్టరేటు గోదావరీసమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమానికి జిల్లా స్థాయీ అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ,అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ధరఖాస్తులు పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించ వద్దని, కొంతమంది అధికారులు క్రింద స్థాయి సిబ్బంది దగ్గరకు పంపిస్తున్నారని, కొందరు నాపరిధి లోనిది కాదని సమాధానం చెబుతున్నారని ఇది క్షమించరాని నేరమని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అర్జీదారుని వద్దకు వెళ్ళి వారితో ఫ్రెండ్లీగా మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని అన్నారు. ధరఖాస్తులు పరిష్కారంలో అర్జీదారులు నుండి ఒక్కఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులుపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.కామవరపుకోట మండలం సాగిపాడు – వీరంపాలెంకు చెందిన అమృతల గోయమ్మ నేను దివ్యాంగురాలును పెన్షన్ రూ 6 వేలు వస్తున్నాయని, తల్లిదండ్రులు చనిపోయారని ఉండుటకు ఇల్లు కూడా లేదని నాకు ఉపాధి అవకాశం కల్పించాలని అర్జీని ఇచ్చారు, దెందులూరు మండలం కొత్తపల్లి – వేగవరం గ్రామానికి చెందిన వరికూటి మార్తమ్మ మాకు 50 సెంట్లు భూమి ఉందని, భర్త మరణించారని ఆ భూమిని నా పేరున ఆన్లైన్ చేయించాలని కోరారు, టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన రేగాళ్ల పుల్లయ్య మా అబ్బాయిలు, కోడళ్ళు కనీసం భోజనం కూడా పెట్టుటలేదని, నేను పంచి ఇచ్చిన ఆస్తిని నాపేరున బదలాయించాలని కోరారు, ఏలూరు మండలం మల్కాపురం గ్రామనివాసి జంపన వెంకటనారాయణ నాకు ఒక్క ఎకరం పొలం ఉంది పట్టాదారు పాసు పుస్తకం కూడా ఉంది, కాని ఆన్లైన్ లో 5 సెంట్లు భూమి మాత్రమే చూపిస్తుందని న్యాయం చెయ్యాలని అర్జీని సమర్పించారు, పోలవరం మండలం కొమ్ముగూడెం గ్రామనివాసి బాదావతు పార్వతి నేను ఐటిడిఏ ద్వారా వసతి వసతిగృహంలో 18 ఏళ్ళుగా పనిచేస్తున్నాను, రాత్రిపూట విధులు నిర్వహించాలని, నానా ఇబ్బందులు గురి చేస్తున్నారని, నాకు దివ్యాంగులు పిల్లలు ఉన్నారని న్యాయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు. .

## వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి నారా లోకేష్ ఘన నివాళులు.



**అమరావతి బ్యూరో చీఫ్ ఆగస్టు 17 నంది పత్రిక** రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెంలో టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు మరియు టీడీపీ ముఖ్య నేతలు పాల్గొని ఎన్టీఆర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ ఆశయాలు, తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన సేవలను నేతలు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమానికి రాజధాని ప్రాంత రైతులు భారీగా తరలివచ్చి తమ అభిమాన నేత ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.అనంతరం మంత్రి నారా లోకేష్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీడీపీ నేతలు అసెంబ్లీకి బయలుదేరారు.



## ఝార్ఖండ్‌లోనూ విద్యార్థులదే పైచేయి.. దిగొచ్చిన ప్రభుత్వం.. జేఎస్ఎస్ సీ-సీజీఎల్ పరీక్ష రద్దు

ఝార్ఖండ్‌లో ఉద్యోగార్థులు, విద్యార్థులు సాగించిన సుదీర్ఘ పోరాటం ఫలించింది. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (జీూాజ-జ+ూ) పరీక్షను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. పేపర్ లీకేజీ, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రభుత్వం దిగివచ్చింది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో అభిజీత్ దీప్కే నేతృత్వంలో సీజేపీ నిర్వహించిన జెన్ జీ ఉద్యమం సఫలం అయిన నేపథ్యంలో, ఝార్ఖండ్ విద్యార్థుల ఉద్యమంపై జాతీయ స్థాయిలో ఆసక్తి నెలకొంది సోమవారం సీఎం హేమంత్ సోరెన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్నోకు చెందిన 'టీడీపీఎల్' (ూ= ఐఝు ్రాతీశీఱవంఅఅస్త్ర ్రాతీఱఅఝవ ూఱఎఱ్వస) అనే ప్రైవేట్ సంస్థ నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. "టీడీపీఎల్ సంస్థకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను రద్దు చేయాలని నిర్ణయించాం. ఆ సంస్థ నిర్వహించిన పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపికైన అభ్యర్థుల జాబితాలు సహా అన్నీ రద్దవుతాయి" అని సోరెన్ మీడియాకు వివరించారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ నేతృత్వంలో ఒక ప్రత్యేక పరీక్షల సంస్కరణల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కమిటీ 2014 నుంచి జరిగిన నియామక పరీక్షల్లోని లోపాలు, అవకతవకలపై దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ప్రభుత్వ నిర్ణయంతో గత 24 రోజులుగా నిరసనలు చేస్తున్న విద్యార్థులు, అభ్యర్థులు ఆనందంలో మునిగిపోయారు. రాంచీలోని జైపాల్ సింగ్ స్టేడియంలో ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.

## పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటాం

### జిల్లా కలెక్టర్ వేట్రి సెల్వి



**ఏలూరు, బ్యూరో చీఫ్ ఆగష్టు, 17 నంది పత్రిక:** పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు అర్జీదారుల వద్దకు వెళ్లి అర్జీ అందినట్టు రసీదు అందించి, సక్రమ విచారణ చేయాలన్నారు. అర్జీదారుడిని కలిసినట్టు ఫోటో ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలన్నారు. కానీ కొందరు అధికారులు అర్జీదారులను కలవకుండా తమవద్దకు పిలిపించుకుంటున్నారని, అర్జీలను సక్రమంగా విచారణ చేయకుండా పరిష్కారం చూపుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేసి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి కార్యాలయంనకు ప్రజలు అందించిన పిజిఆర్ఎస్ అర్జీలను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)- 2026 లో ముసాయిదా జాబితాలో క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలకు సంబంధించి అర్జీదారులకు నోటీసులు అందించాలని, నోటీసులపై నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం -6, 7, 8 లపై అందిన దరఖాస్తులను పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఎస్డిసి దేవకీదేవి, జిల్లా పరిషత్ సీఈఓ జగదాంబ, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, స్వర్ణ గ్రామ/వార్డ్ సచివాలయాలు ప్రత్యేక అధికారి నాయుడు, వివిధ శాఖల అధికారులు, ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓ లు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, బిఎల్ఓ లు, ప్రభృతులు పాల్గొన్నారు.

## ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహణ పనితీరు సమస్యలపై గిరిజన వ్యవహారాలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజన చోప్రా కాన్ఫరెన్స్

**ఏలూరు, బ్యూరో** గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆగష్టు, 17 దేశంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ, పనితీరు, ఉత్పన్నమవుతున్న వివిధ సమస్యలపై గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజనా చోప్రా ఢిల్లీ నుండి సోమవారం దేశంలోని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రంజనా చోప్రా మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగల విద్యార్థులకు నాణ్యమైన విద్య మరియు సమగ్ర వికాస అవకాశాలను కల్పించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 'ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్' (ఈ ఎమ్ ఆర్ ఎస్) పథకాన్ని అమలు చేస్తున్నాదని , వీటి పనితీరును పర్యవేక్షణ, సమస్యలను సకాలంలో పరిష్కరించడంలోనూ జిల్లా కలెక్టర్/డిప్యూటీ కమిషనర్ అధ్యక్షతన పనిచేసే 'జిల్లా స్థాయి కమిటీ'( డి ఎల్ సి) కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ పాఠశాలల పనితీరును సమర్థవంతంగా సమీక్షించడానికి మరియు పర్యవేక్షించడానికి జిల్లా స్థాయి కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం చాలా ముఖ్యమని జిల్లా కలెక్టర్లు ఈ దిశగా కృషిచేయాలన్నారు. ఏలూరు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను తెలియజేసారు.



## ఆళ్లగడ్డ నియోజకవర్గ మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ గా పసుల నరేంద్ర యాదవ్..




**సిరివెళ్ల (నంది పత్రిక)**మెగా ఫ్యామిలీ అభిమాన సంఘం మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర స్థాయి కమిటీలు నిన్న విడుదల చేశారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గ కన్వీనర్ గా పసుల నరేంద్ర యాదవ్ గారిని నియమించారు. అదే విధంగా జాయింట్ కన్వీనర్లుగా రఘునాథ రెడ్డి, చిన్న పెద్దయ్య, కో కన్వీనర్లుగా గుర్రప్ప, శంకర్, వెంకట సుబ్బారెడ్డి, తులసన్న ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా కేశవ, కోటి, బ్రహ్మేంద్ర కుమార్, కోట్ల బాబు అలాగే స్పోక్ పర్సన్ గా జమాల్ భాషను నియమించినట్లు మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర కార్యవర్గం ప్రకటన విడుదల చేసింది.

## ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి: ఎస్డీపీఐ




**వెలుగోడు, ఆగస్టు 17 (నంది పత్రిక):** 2024 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్డీపీఐ శ్రీశైలం అసెంబ్లీ ఆధ్వర్యంలో సోమవారం వెలుగోడు పొట్టి శ్రీరాములు సెంటర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎస్డీపీఐ శ్రీశైలం అసెంబ్లీ ఉపాధ్యక్షులు హాఫిజ్ షఫీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదా, ముస్లిం మైనార్టీలకు హజ్ హౌస్ నిర్మాణం, ఈద్గా, కబ్రస్తాన్‌లకు స్థలాల కేటాయింపు వంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని. ఎన్నికల హామీలకు స్పష్టమైన కాలపరిమితిని నిర్ణయించి పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు.యంగ్ డెమోక్రట్స్ స్టేట్ జైంట్ కన్వీనర్ సయ్యద్ ఇంతియాజ్ మాట్లాడుతూ యువతకు హామీ ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.వైఎస్సార్‌సీపీ జిల్లా కో-ఆప్షన్ సభ్యులు ఇలియాస్ మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.1,500 ఆడబిడ్డ నిధి, ఇమామ్‌లు, మౌజన్‌లు, పూజారులకు ప్రకటించిన గౌరవ వేతనాలను అమలు చేయాలి. ముస్లిం మైనార్టీల సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎస్డీపీఐ నాయకులు, సీపీ జిల్లా కో-ఆప్షన్ సభ్యులు ఇలియాస్, యంగ్ డెమోక్రట్స్ జైంట్ కన్వీనర్ సయ్యద్‌యాజ్‌తో కలిసి ఎన్ఆర్వో రాష్ట్ర అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్డీపీఐ జిల్లా కమిటీ సభ్యులు లింకన్ రాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు హాఫిజ్ షఫీ, కార్యదర్శి తౌసిఫ్, కోశాధికారి మొయిన్, కమిటీ సభ్యులు మునీర్, ఫయాజ్, నాయకులు సయ్యద్ రసూల్, సలీం ఉన్నారు.

## 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నాసిరకం పనులపై ఉభయ సభల్లో చర్చ చేపట్టాలి

### సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య విజ్ఞప్తి



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 17 నంది పత్రిక** గత ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం నాసిరకం పనులపై అసెంబ్లీ, శాసనమండలిలో ప్రత్యేక చర్చను చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన బోర్డు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ళలోనే విగ్రహం రంగులు పూర్తిగా వెలిసిపోయాయని చెప్పారు. ఇటీవల తాను విగ్రహం వద్దకు వెళ్ళి పరిస్థితులను స్వయంగా చూశానని, మళ్ళీ రంగులు వేయటానికి కోట్లు ఖర్చు అవసరం ఉంటుందని చెప్పారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతిలో అంబేద్కర్ స్మృతి వనానికి ఇచ్చిన 30 ఎకరాల భూమిని రద్దు చేసి, అక్కడ ఏర్పాటు చేస్తున్న మూడు అంబేద్కర్ విగ్రహాలను దొంగలపాలు చేశారని ఆరోపించారు. దీనికి బదులుగా దళితుల ఓట్లు కొల్లగొట్టేందుకు ఖరీదైన విజయవాడ నగర ప్రజలందరికీ ఉపయోగంలో ఉన్న దాదాపు రెండు వేల కోట్ల రూపాయల స్థలంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి, తన పేరును తాటికాయంత అక్షరాలతో పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. దాదాపు రూ. 400 కోట్లు ఖర్చు పెట్టి, విగ్రహాన్ని నాసిరకంగా పనులు చేశారని, దీనిపై లోతైన చర్చ చేసి నిజా నిజాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. దళిత ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకెళ్లాలని బాలకోటయ్య అభిప్రాయపడ్డారు.

## ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగబాబు..

### ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 17 నంది పత్రిక** ఏపీ గ్రీనింగ్, 'రీఫారెస్టేషన్' (పునరటవీకరణ) కార్యక్రమాల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబును (నాగేంద్రరావు)ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్టీ నంబర్ -93 ద్వారా ఈ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం, అడవుల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది.జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ఆయా కార్యక్రమాలను అమలు చేయనుంది. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణంలో ఫారెస్ట్, ట్రీ కవర్‌ను 2047 నాటికి 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ఏపీ సర్కార్ చర్యలు చేపడుతోంది. ఏపీ గ్రీన్ గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీ, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల పాలక మండళ్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర గ్రీన్ లక్ష్యాల అమలు, సమన్వయం, పర్యవేక్షణలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్ కీలక పాత్ర పోషించనున్నారు. ఈ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కొణిదెల నాగేంద్రబాబును నియమించిన ఏపీ సర్కార్.. ఆయనకు కేబినెట్ హోదా కల్పించింది. ఈ నిబంధనలకు లోబడి కేబినెట్ ర్యాంక్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీన్, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల కార్యకలాపాల సమర్థవంతంగా అమలు చేయాలని ఈ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది.

## ఎమ్మెల్యేగా ప్రశాంత్ కిషోర్ ప్రమాణం

జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్(పీకే) ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం బీహార్ శాసనసభలో స్పీకర్ ప్రేమ్ కుమార్ సమక్షంలో బంకిపూర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆగస్టు 3వ తేదీన బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో పీకే ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 1995 నుండి బీజేపీ కంచుకోటగా ఉన్న ఈ స్థానాన్ని దక్కించుకున్న పీకే.. బీజేపీకి గట్టి దెబ్బ కొట్టి చరిత్రాత్మక ఎన్నికల రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం 64,151 ఓట్లు సాధించిన పీకే.. బీజేపీకి చెందిన నీరజ్ కుమార్‌ను 19,324 ఓట్ల తేడాతో ఓడించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో.. బంకీపూర్ అసెంబ్లీ సీటు ఖాళీ అయ్యింది. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో పోటీ చేసిన పీకే.. ఎవరూ ఊహించని రీతిలో విజయం ఢంకా మోగించి.. బిహార్ అసెంబ్లీలో అడుగుపెట్టారు.

# సోలార్ పవర్‌లో స్వయం సమృద్ధి సాధించాలి !

దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడడం మానుకోవాలని ప్రధాని మోడీ ఎర్రకోట్ నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపచేసేదిగా ఉంది. అయితే దేశాన్ని స్వయం సమృద్ధిగా నిలపాల్సిన బాధ్యత పాలకులదే. ముఖ్యంగా ఇంధన, ఆహార రంగాల్లో మనం మరింత బలం కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ తన ఇంధన అసవరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడు తోంది. 88.5 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఇలా అన్నింటికి గల్ఫ్, రష్యా, అమెరికా వంటి దేశాలే దిక్కు. అంతర్జాతీయ పరిణామాలకు భారత ఇంధన భద్రత ఒడిదొడు కులకు లోనవుతోంది. ఇటీవల హార్ముజ్ జలసంధి, ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్ లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఎక్కువ దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఒక్క యుద్ధం వస్తే ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతాం. అందువల్ల సహజ వనరులను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. విదేశాల నుంచి అదేపనిగా అవసరం ఉన్నా లేకున్నా దిగుమతలును చేసుకోవడం వల్ల దేశీయంగా ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి. ముఖ్యంగా ఉప్పులు, పప్పులు, నూనెలపై ఆంక్షలు విధించుకోవాలి. దేశీయంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం తప్పనిసరి చేయాలి. ఇకపోతే గ్యాస్, పెట్ర తదితర ఉత్పత్తులపైనా అన్వేషణ సాగాలి. మన సముద్ర భాగాల్లోనే గ్యాస్ లేదా పెట్రోలియం నిల్వలు వెలుగులోకి వస్తే భారతదేశానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రధాని మోడీ కూడా సముద్ర మథనం గురించి చెప్పారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ.. సముద్ర మంథన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. భారత జలాల్లో సముద్ర అడుగు భాగాల్లో ఇంధన వనరుల కోసం అన్వేషన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వెల్లడించారు. భారత్ తన ఇంధన అవసరాల్లో మెజారిటీ దిగుమతులపై ఆధారపడు తోంది. అయితే, గతంలో భారత్‌లో ఆఫ్‌షోర్ అన్వేషణకు సంబంధించిన ప్రాంతాల్లో దాదాపు 99 శాతం ప్రాంతాన్ని గతంలో 'నో-గో' జోన్‌లుగా ప్రకటించినట్లు, ఇప్పుడు వాటిలో చాలా ప్రాంతాలను అన్వేషణ కోసం తెరిచినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల గ్యాస్, పెట్రోలియం వంటి ఇంధనాన్ని గుర్తించే పక్రియ మరింత వేగవంతం కానుంది. భారత్ ఇంధన నిల్వల్ని అన్వేషించేందుకు 'సముద్ర మంథన్' అనే నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ స్కీమ్ ప్రకటించింది. భారతదేశ సముద్ర తీర ప్రాంతాల్లోని బేసిన్లలో చమురు, సహజ వాయువు నిల్వలను గుర్తించి భవిష్యత్తులో ఉత్పత్తి పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు రూ.84,084 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సముద్ర అడుగుభాగంలోని భౌగోళిక నిర్మాణాలను గుర్తించేందుకు సిస్మిక్ సర్వేలు, డీప్ సీ, అల్ట్రా డీప్ వాటర్ డ్రిల్లింగ్, సైంటిఫిక్ డ్రిల్లింగ్, సాధారణ ఆఫ్‌షోర్ మౌలిక వసతులు, చమురు-గ్యాస్ తయారీ వంటివి ఉంటాయి. ఈ పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ నిల్వలు దేశానికి సమకూర్చవచ్చని, దేశీయ ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ ప్రకారం భారత్‌కు తొమ్మిది ఆఫ్‌షోర్ బేసిన్లు ఉన్నాయి. ఇవి మొత్తం సుమారు 17.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం నో-గో ఏరియా ప్రాంతాలను 13.67 లక్షల చదరపు కిలోమీటర్ల నుంచి 24,832 చదరపు కిలోమీటర్లకు తగ్గించారు. దీని ద్వారా భారత్‌కు చెందిన 23.6 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజి)లో సుమారు 99 శాతం ప్రాంతం అన్వేషణకు అందుబాటులోకి వచ్చింది. ఈ ఏరియాల్లో అన్వేషణ పెరుగుతుంది. అన్వేషణ పెరిగినంత మాత్రాన ఖచ్చితంగా గ్యాస్, పెట్రోలియం ఉంటుదని హామీ ఇవ్వదు. డీప్-సీ ఎక్స్‌ప్లోరేషన్ చాలా ఖరీదైనది, సాంకేతికంగా క్లిష్టమైనది, ఫలితాలు అనిశ్చితంగా ఉండే పక్రియ. అందుకే మెరుగైన భౌగోళిక డేటా, మరిన్ని డ్రిల్లింగ్ కార్యకలాపాలు, కొత్త మౌలిక వసతుల ద్వారా అన్వేషణ నుంచి ఉత్పత్తి దశకు చేరే అవకాశాలను 'సముద్ర మథన్' పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భారత ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో బయో ఇంధనాలపైనా ప్రయత్నాలు సాగాలి. పరిశోధనలు చేపట్టాల్సి ఉంది. సోలార్ పవర్ పరిశోధనలు విస్తృతం కావాలి. దీనిలో విజయం సాధిస్తే ఇంధన కొరతను అధిగమించవచ్చు. ఈ దిశగా పరిశోధనలు పెరగాలి. సోలార్ పవర్‌ను చౌకగా ఉత్పత్తి చేసుకునే దశకు చేరుకోవాలి. అప్పుడే మనకు భవిష్యత్ సులువు కాగలదు. అతిగా విదేవాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. దీంతో ఇంధన అవసరాలతో పాటు, విద్యుత్ సంక్షోభం కూడా తొలగనుంది.

# ఏఐతో ముప్పు మన జ్ఞానానికి కాదు..!

మనిషికి ఒక గొప్ప చెత్త లక్షణం ఉంది. తను ఒకటి సృష్టిస్తాడు. దానికే భయపడతాడు. దాన్ని నిర్మూలించాలనుకుంటాడు. దానికే బానిసవుతాడు. మనిషిది విజయాల చరిత్ర కాదు. భయాల చరిత్ర. నిప్పును, యంత్రాన్ని, కరెంటును, టెలిఫోన్‌ను, కంప్యూటర్‌ను, మొబైల్ ఫోన్‌ను, రోబోను చూసి భయపడ్డాడు. ఇప్పుడు ఏఐని చూసి భయపడుతున్నాడు.ప్రతి కొత్త ఆవిష్కరణ మనిషిని అనివార్యంగా అభద్రతలోకే నెట్టింది. ఇది వచ్చాక నేను ఏమవుతాను? అని ప్రతిసారీ మనిషి భయం. కానీ విచిత్రమేమిటంటే కొన్ని వేల సంవత్సరాలుగా ఆ ప్రశ్న పదే పదే అడుగుతూనే మనిషి ఇంకా అదే వలయంలో చిక్కుకున్నాడు. మారింది అతని పని, పనిముట్టు, వేగం, జీవన విధానం. కానీ మనిషి ఏ దశలోనూ ధ్వంసం కాలేదు. ముద్రణ యంత్రం, రైలు, విద్యుత్తు, ఫోటోగ్రఫీ, సినిమా, ఏటీఎం, ఇంటర్నెట్, గూగుల్, స్మార్ట్ ఫోన్, ఏఐ వరకూ ప్రతి దశలో అదే భయం. ఏఐ గురించిన చాలా భయాలు మనకు వినపడుతున్నాయి. అయితే, అనవసరంగా తీవ్రంగా భయపడుతున్నారు. నిజంగా భయపడాల్సిన కోణం అది తాగుతున్న నీరు గురించి. ఏఐ నీటి వాడకం పర్యావరణానికి చేయబోతున్న ముప్పు గురించి. అది సర్వర్లను చల్లబరచడానికి తాగుతున్న నీళ్ల క్వాంటిటీ గురించి భయపడాలి. కొన్ని లక్షల టీఎంసీల నీరు ఏఐ తాగేస్తోందన్నది చాలామందికి తెలియని నిజం. ఆ నీళ్లు లేకుంటే ఏఐ సమాధానాలు చెప్పలేదన్నదీ నిజం. అయితే ఆ నీళ్ల వినియోగం వల్ల వచ్చే ముప్పు ఎంత, దానికి పరిష్కారం ఏమిటి? నిజానికి ఏఐ నీటిని తాగడం సమస్యేనా? మనిషి తాగే నీటినే ఏఐకి ఇవ్వాల్సి వచ్చే విధంగా దాన్ని నిర్మిస్తే అది సమస్య కాదా? సముద్రంలోని ఉప్పు నీటిని ఈ చల్ల బరచడానికి వాడడం సాధ్యమా అనే విషయాల గురించి ఆలోచించాలి. తాగు నీరు కాకుండా, భూజలం కాకుండా ఏ నీటిని సర్వర్ల కోసం వాడాలి అనేది తెలుసుకోవల్సిందీ తేల్చాల్సింది మనిషే. సాంకేతికతకు దాహం ఉండదు. దాన్ని ఎక్కడ నిర్మించాలి, ఏ నీటితో చల్లబరచాలి, మనిషి అవసరానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి అనేది నిర్ణయించేది మనిషే. అంటే ఏఐ నుంచి వచ్చే ముప్పు కూడా చివరికి ఏఐ తెలివిలో కాదు, మనిషి తీసుకునే తెలివి తక్కువ నిర్ణయాల్లో ఉందనమాట! ఇక ఏఐ గురించిన మనిషి ఇంకో భయం దాని జ్ఞానం. అయితే భయాన్ని జయించడం అంటే దాన్ని నాశనం చేయడం కాదు, అర్థం చేసుకోవడం. నిప్పు మనిషి మొదటి భయం, మొదటి స్నేహితుడు కూడా. మొదట దాన్నుంచి పారిపోయాడు. తర్వాత అర్థం చేసుకున్నాడు. చివరకు అదే నిప్పుతో ఆహారం వండుకున్నాడు, చలిని తరిమాడు, చీకటిని జయించాడు. చక్రం మనిషి కాళ్లకు సవాలుగా వచ్చింది. కానీ కాళ్లను నిరుపయోగం చేయలేదు. చేరలేని దూరాలకు తీసుకెళ్లింది. యంత్రానికి వేగం ఉండొచ్చు, గమ్యం మాత్రం మనిషిదే. పారిశ్రామిక విప్లవంతో యంత్రాలు వచ్చాక ఉద్యోగాలు పోతాయని కార్మికులు భయపడ్డారు. ౹ాబుంంఙవం యంత్రాలను ధ్వంసం చేశారు. వారి భయం యంత్రాల మీద మాత్రమే కాదు. జీవనోపాధి కోల్పోతామన్న ఆందోళన మీద. ఇప్పుడు ఏఐ విషయంలోనూ అదే ప్రశ్న మా ఉద్యోగాలేమవుతాయి అని. చరిత్ర చెప్పేది మాత్రం స్పష్టం. కొన్ని పనులు పోతాయి, కొత్త పనులు పుడతాయి. ప్రొక్లెయిన్ వందమంది పని ఒక్క యంత్రంతో చేసింది. కానీ అదే యాంత్రీకరణ రోడ్లు, కాలువలు, ఆనకట్టలు, భారీ నిర్మాణాలను వేగవంతం చేసింది. యంత్రం మనిషిని అవమానించలేదు. అతని కఠిన శ్రమను తగ్గించింది. రాత వచ్చినప్పుడు జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని భయపడ్డారు. ఇప్పుడు గూగుల్, స్మార్ట్ ఫోన్, ఏఐ గురించి కూడా అదే భయం. వ్యంగ్యం ఏమిటంటే రాత జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుందని చెప్పిన మాట కూడా మనకు రాత ద్వారానే తెలిసింది. టెలిఫోన్ సంబంధాలను చంపుతుందని అనుకున్నాం. కానీ అది దూరాన్ని చంపింది. కంప్యూటర్ ఉద్యోగాలను మింగేస్తుందని భయపడ్డాం. కొన్ని ఉద్యోగాలు తగ్గాయి, కానీ సాఫ్ట్‌వేర్, డేటా, డిజిటల్ వ్యాపారాల వంటి కొత్త ప్రపంచాలు పుట్టాయి. ప్రతి కొత్త సాంకేతికత ముందూ మనిషి మొదట భయపడ్డాడు. తర్వాత దాన్ని అర్థం చేసుకున్నాడు. చివరకు తన సాధనంగా మార్చుకున్నాడు. ఏఐ కూడా ఆ చరిత్రలో మరో అధ్యాయం మాత్రమే. ఏఐ ఇప్పుడు మన ముందున్న కొత్త భయం. ఇది పాత వస్తువుల కంటే కొంచెం భిన్నంగా కనిపిస్తోంది. ఎందుకంటే పాత యంత్రాలు ప్రధానంగా మనిషి శరీరానికి పోటీ. ఏఐ మాత్రం మనిషి మెదడుకు పోటీ. ఇది మనిషికి కొత్త అనుభవం. అందుకే ఎక్కువ భయం. ఏఐ రచన చేస్తోంది. బొమ్మ గీస్తోంది. సంగీతం స్వరపరుస్తోంది. కోడ్ రాస్తోంది. భాషలు అనువదిస్తోంది. రోగ నిర్ధారణలో సహాయపడుతోంది. డేటాను విశ్లేషిస్తోంది. మనిషితో సంభాషిస్తోంది. అందుకే ఈసారి ప్రశ్న మరింత భయపెట్టేదిగా ఉంది. యంత్రం ఆలోచించగలిగితే మనిషి ఎందుకు? అనేది తాజా ప్రశ్న. అయితే తెలివి ఒక్కటే మనిషిని మనిషిగా చేయలేదు. ఏఐ సమాధానం తెలుసుకుంటుంది. మనిషికి ప్రశ్న తడుతుంది.

ఒక ఏఐ లక్షల పుస్తకాల్లోని సమాచారాన్ని ప్రాసెస్ చేయగలదు. కానీ నేను ఎవరు అని మొదట అడిగింది యంత్రం కాదు, మనిషి. నక్షత్రాలను లెక్కపెట్టే కంప్యూటర్ ఉండొచ్చు. కానీ రాత్రి ఆకాశాన్ని చూసి అక్కడ ఇంకెవరైనా ఉన్నారా? అని ఆశ్చర్యపోయింది మనిషి. ఏఐ చెత్తదో డొక్కుదో ప్రేమ కవిత రాయగలదు. కానీ ప్రేమించిన మనిషి కోసం రాత్రంతా నిద్రపోకుండా ఎదురుచూడదు. విరహగీతం తయారు చేయగలదు. విరహాన్ని అనుభవించదు. సమాచారం అనుభవం కాదు. లెక్కించడం జీవించడం కాదు. సమాధానం చెప్పడం జ్ఞానం కాదు. మరి ఈ కోణంలో ఏఐ ప్రమాదం కాదా? అంటే కాదనలేం. ఏఐతో ఉద్యోగాలు మారవచ్చు. కొన్ని ఉద్యోగాలు తగ్గవచ్చు. నకిలీ సమాచారం, మోసాలు, పర్యవేక్షణ, అధికార కేంద్రీకరణ, సృజనాత్మక హక్కులు వంటి తీవ్రమైన సమస్యలు రావచ్చు. అందువల్ల ఏఐ గురించి ప్రశ్నించాలి. చట్టాలు కావాలి. నైతిక పరిమితులు కావాలి. నియంత్రణ కావాలి. కానీ భయం వల్ల దాన్ని తిరస్కరించడం పరిష్కారం కాదు. ఒకప్పుడు యంత్రాలను పగలగొట్టడం వల్ల పారిశ్రామిక విప్లవం ఆగలేదు. ఏఐని తిడితే ఏఐ ఆగదు. దాన్ని అర్థం చేసుకోవాలి. దాని మీద అధికారం ఎవరిదో ప్రశ్నించాలి. దాని ప్రయోజనాలు కొద్దిమంది కంపెనీలకే కాక సమాజానికి ఎలా అందాలో నిర్ణయించాలి. మనిషి పని పోకుండా మాత్రమే కాదు, మనిషి గౌరవం పోకుండా చూసుకోవాలి. ఎందుకంటే యంత్రానికి ఒక పరిమితి ఉంది. ప్రొక్లెయిన్ కొండను తవ్వగలదు. కానీ ఆ కొండను తవ్వాలా వద్దా అని నిర్ణయించాల్సింది మనిషే. కంప్యూటర్ కోట్ల లెక్కలు చేయగలదు. కానీ ఏ లెక్క న్యాయమైనదో నిర్ణయించాల్సింది మనిషే. రోబో తుపాకీ పేల్చగలదు. కానీ ఎవరి మీద తుపాకీ ఎత్తకూడదో చెప్పాల్సింది మనిషే. ఏఐ ఒక తీర్పుకు అవసరమైన సమాచారాన్ని విశ్లేషించగలదు. కానీ న్యాయం అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాజం సమాధానం చెప్పాలి. ఇక్కడే మనిషి ఆధిక్యం ఉంది. అది ఐక్యూలో కాదు. వేగంలో కాదు. జ్ఞాపకశక్తిలో కాదు. లెక్కల్లో కాదు. విలువలను సృష్టించగలగడంలో ఉంది. అందుకే ఏఐ యుగంలో మనిషి అడగాల్సిన ప్రశ్న 'ఏఐ మనిషిని మించిపోతుందా?' అని కాదు. ఏఐని ఉపయోగించి మనల్ని మనం ఎంత మెరుగుపరుచుకుంటాం? అన్నది. ఎందుకంటే నిప్పు గొప్పది కాదు. దాన్ని అదుపులోకి తెచ్చిన మనిషి గొప్పవాడు. చక్రం గొప్పది కాదు. దానికి గమ్యం ఇచ్చిన మనిషి గొప్పవాడు. యంత్రం గొప్పది కాదు. దానికి పని చెప్పిన మనిషి గొప్పవాడు. కంప్యూటర్ గొప్పది కాదు. దానికి భాష నేర్పిన మనిషి గొప్పవాడు. ఏఐ శ్రీశ్రీని తయారు చేయలేదు, డావిన్సీని పుట్టించలేదు. మనిషి కంటే తెలివైన యంత్రం ఉంటుంది, మనిషి కంటే గొప్ప యంత్రం ఉండదు. తన తెలివిలోంచి తనకే పోటీ అయ్యే మరో తెలివిని సృష్టించగలిగిన మనిషే గొప్పవాడు. బహుశా మానవ నాగరికత మొత్తాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే 'మనిషి ప్రతి కొత్త శక్తిని చూసి మొదట భయపడ్డాడు. తర్వాత దాన్ని తన పనిముట్టుగా మార్చుకున్నాడు' అని చెప్పాలేమో. ఏఐ విషయంలోనూ జరగాల్సింది అదే. ఏఐ మనిషికి ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం లేదు. అది మనిషి చేతిలో మరో పరికరం కావచ్చు. ఎందుకంటే యంత్రానికి తెలివి, వేగం, జ్ఞాపకశక్తి, భాష ఇవ్వగలం. కానీ మనిషి దగ్గర ఉన్న ఒక అత్యంత విలువైన విషయం యంత్రానికి ఇవ్వడం అంత సులభం కాదు. 'నేను ఏం చేయాలి?' అని తనను తాను ప్రశ్నించుకునే నైతిక చైతన్యం మాత్రం ఇవ్వలేం. ఆ ప్రశ్న ఉన్నంతకాలం మనిషి అవసరం తీరదు. మనిషి కథ ముగియదు. మరో కొత్త సాంకేతికత వస్తుంది. మనిషి మళ్లీ భయపడతాడు. కొంతకాలం దాన్ని తిడతాడు. తర్వాత దాన్ని అర్థం చేసుకుంటాడు. చివరకు దానితోనే చేయి కలిపి 'సరే... ఇప్పుడు మనం మనం భాయి భాయి' అంటాడు. అక్కడి నుంచి నాగరికత మరో అడుగు ముందుకు వేస్తుంది.

# 'ఉపాధి' లబ్ధిపై ఆంక్షలు

కేంద్రం నూతనంగా తెచ్చిన వీబీ జీరామ్‌జీ పథకంలో ఉపాధి ద్వారా పొందే లబ్ధిపై ఆంక్షలు విధించారు. గతంలో ఈ పథకం పరిధిలో ఎన్ని స్కీంలు ఉన్నా వాటన్నింటినీ వినియోగించుకునే అవకాశం లబ్ధిదారులకు ఉంది. నిబంధనల ప్రకారం అర్హత గల వారికి వాటిని మంజూరు చేసి తద్వారా వచ్చే లబ్ధి ఎంత మొత్తం అయినా ఇచ్చేవారు. అలాంటిది నూతన చట్టంలో ఒక కుటుంబానికి గరిష్ఠంగా రూ.4లక్షలు పరిమితి విధించారు. ఈ పథకంలో అనేక స్కీంలు ఉండగా తాజా చట్టంలో నిర్దేశించిన రూ.4లక్షల పరిమితి అమలు చేస్తే పండ్లతోటల పథకం కింద ఎంపికైన లబ్ధిదారునికి మరొక స్కీం ఇచ్చే అవకాశం ఉండదు. ఎందుకంటే పండ్లతోటల పథకం కింద ఐదు ఎకరాలు మంజూరు చేస్తే వారికి మూడేళ్లలో ఇచ్చే ఆర్థిక సాయం రూ.4 లక్షలు దాటిపోతుంది. గతంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) అమలులో ఉన్నప్పుడు కూలీలకు వేతనాలు లభించే పనుల కల్పనతోపాటు మెటీరియల్ కోటా నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో సామాజిక, వ్యక్తిగత ప్రయోజనం ప్రత్యేకించి గ్రామీణ కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ఉపకరించేవి ఉండేవి. సామాజిక అంశాలలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సిమెంట్ రోడ్లు, డ్రెయిన్‌లు, పాఠశాలలు, శ్మశానాలు, పలు భవన నిర్మాణాలు భాగంగా చేపట్టేవారు. అలాగే గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగు, జలసంరక్షణలో భాగంగా విస్తారంగా పండ్లతోటల పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణం, పొలాల్లో పంట కుంటలు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల తవ్వకాలు, పేదల పక్కాగృహాల నిర్మాణం వంటి అనేక స్కీంలకు ఈ నిధులు మంజూరు చేసేవారు. పండ్లతోటల పథకంలో గరిష్ఠంగా ఐదు ఎకరాల పరిమితి ఉండగా మూడేళ్ల వ్యవధిలో ఎకరాకు రూ.లక్ష వరకు లబ్ధిచేకూరేది. పంట కుంటలకు ఒక్కొక్కరికి రూ.10వేలు సగటున అందేవి. అలా ఒక రైతు తన భూమిలో ఎన్ని అయినా తవ్వుకునే అవకాశం ఉండేది. పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసేవారు.

**పరిమితి విధింపుతో ఆందోళన** గతంలో ఒక కుటుంబానికి పండ్లతోటల పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణం, పంట కుంటలు, ఇంకుడు గుంతల తవ్వకాలు, ఇతరత్రా ఎన్ని స్కీంలైనా మంజూరు చేసి వాటి ద్వారా వచ్చే ఆర్థిక లబ్ధిపై పరిమితి లేకుండా అందజేసే వారు. కూలీలకు కల్పించే పనులకు వీరు కూడా వెళ్లవచ్చు. అయితే తాజా చట్టం నిబంధనల ప్రకారం ఒక కుటుంబానికి అన్ని స్కీంలు కలిపి రూ.4లక్షలు మించి లబ్ధి అందే అవకాశాలు లేవు. ఆ మేరకు పరిమితి విధించారు. అంటే నాలుగు ఎకరాల పండ్లతోటల స్కీం మంజూరు చేస్తే సదరు రైతుకు ఇక పంట కుంటలు, పశువుల షెడ్ ఇతరత్రా మంజూరు చేసే అవకాశం లేదు. ఈ విధానంతో క్షేత్రస్థాయిలో పథకాల అమలులో ఆటంకాలు ఏర్పడతాయ న్న ఆందోళన ఆ శాఖ సిబ్బందిలోనే వ్యక్తమవుతోంది. కూలీలకు పనుల కల్పన ద్వారా ఇచ్చే వేతనాలను రూ.4లక్షల పరిమితికి లింక్ పెట్టకపోవడం ఊరట కలిగించే అంశం.



## జనసేవే మా జర్నలిజం

## ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ వేడుకల్లో

## జంగారెడ్డిగూడెంలో ప్రజాసేవలో జర్నలిజం



**జంగారెడ్డిగూడెం బ్యూరో చీఫ్, ఆగస్టు 17: నంది పత్రిక** కలం పట్టిన చేతులతోనే మానవత్వాన్ని పంచారు. పదాలతో ప్రజల గొంతుకైన జర్నలిస్టులు మరోసారి సేవా కార్యక్రమాలతో హృదయాలను గెలిచారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జంగారెడ్డిగూడెం పట్టణం సేవా సంకల్పంతో మారింది. రామచంద్రపురం రామాలయం ఆవరణలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన లిమెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరంకు ప్రజలు భారీగా తరలివచ్చారు.మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సీనియర్ నేత పరిమి సత్తిపండు, టిడిపి పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ప్రారంభించారు. సన్ రైజ్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని సిటీ కేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్, బొబ్బర రాజ్ పాల్ కుమార్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

**200 మందికి ఉచితంగా వైద్యం** మమత హాస్పిటల్ సీఈవో వల్లూరి రవితేజ చిన్ని ఆధ్వర్యంలో డా. సుమంత్, డా. శివకుమార్, డా. సునీత తదితర వైద్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు 200 మందికి పైగా పేదలకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. "జర్నలిస్టులు మా కోసం ఇలా చేశారని తెలిసి గర్వంగా ఉంది" అంటూ లబ్ధిదారులు జర్నలిస్టులను అభినందించారు.

**50 మంది యువకులు రక్తదానం** "మా రక్తం ఎవరికో ప్రాణం పోస్తుంది" అంటూ 50 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సన్ రైజ్ బ్లడ్ బ్యాంక్ బృందం ప్రతి ఒక్కరినీ అభినందించింది.ఈ సందర్భంగా ఐజేయు మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ మాట్లాడుతూ, "1957లో పత్రికా స్వేచ్ఛ కోసం పుట్టిన ఏపీయూడబ్ల్యూజే సోమవారంతో 70 ఏళ్లు పూర్తి చేసుకుంది. కలం ద్వారా పోరాడటమే కాదు, అవసరమైనప్పుడు చేయి చాచి ఆదుకోవడమే అసలైన జర్నలిజం" అన్నారు.జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ అమలు, ప్రమాద భీమా, ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో ఎం.వి. రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుమర్తి రామ్ కుమార్, లయన్స్ అధ్యక్షుడు కొండపల్లి పండు, రోటరీ అధ్యక్షుడు పసల సుబ్బారావు తదితరులు పాల్గొని మందులు పంపిణీ చేశారు. సీనియర్ జర్నలిస్ట్ మల్లెల్లి గంగరాజు డా. వల్లూరి రవితేజలను ఘనంగా సత్కరించారు.

## అమెరికా గగనతలంలో తప్పిన ముప్ప ఢీకొనేంతగా దగ్గరకు వెళ్లిన రెండు విమానాలు

ఆకాశంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలకు పెను ప్రమాదం తప్పింది. రెండింటికి ఒకటే నంబర్ ఉండటంతో అవి ఒకే మార్గంలోకి వచ్చి దాదాపు ఢీకొన్నంత పని అయ్యింది. అయితే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ ప్రాంతంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు గాల్లో ఎదురెదురుగా వచ్చాయి. ఫీనిక్స్ స్కైహార్బర్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. అందులో ఒక బోయింగ్ విమానం షికాగో నుంచి వస్తుండగా.. మరో విమానం అప్పుడే ఫీనిక్స్ నుంచి బయల్దేరింది. రెండింటికి ఒకటే ౹÷÷-లట్ నంబర్ ఉండటం (అమెరికన్ 2482), ప్రతికూల వాతావరణంవల్ల షికాగో విమానం ఆలస్యం కావడం రెండు విమానాలు ఒకే లైన్‌లోకి రావడానికి కారణమయ్యాయి. వేర్వేరు మార్గాల్లో వెళ్లే విమానాలకు ఎయిర్‌లైన్స్ ఇలా ఒకే నంబర్ ఇవ్వడం సాధారణమే. అయితే ఒకే కాల్ సైన్ ఉన్న విమానాలు ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఉండటం మాత్రం అరుదుగా జరుగుతుంది. షెడ్యూలింగ్ పొరపాటు కారణంగా ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ అసాధారణ పరిస్థితిని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ గుర్తించారు. అరైవల్, డిపార్చర్‌లో ఉన్న విమానాలకు వెంటనే వేర్వేరు సూచనలు చేశారు. అరైవల్‌లో ఉన్న విమానాన్ని ఎక్కువ ఎత్తు తీసుకోమని, డిపార్చర్‌లో ఉన్న విమానాన్ని తక్కువ ఎత్తులో ప్రయాణించమని సూచించారు. ఆ సూచనకు తగ్గట్టుగానే పైలట్లు తమతమ మార్గాలను మార్చుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తాను 25 ఏళ్లుగా ఈ విధులు నిర్వర్తిస్తున్నానని, ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని కంట్రోలర్ చెప్పారు. అయితే ఈ భద్రతాలోపంపై దర్యాప్తు జరుగుతున్నది.

## అప్పుడు అర్బన్ నక్సల్స్... ఇప్పుడేమో దిమాగీ నక్సల్స్

ప్రధాని నరేంద్రమోడీ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట పై నుంచి దిమాగీ నక్సల్స్ అనే వ్యాఖ్యలు చేయడం ప్రతిపక్షాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంలో ఉపయోగించిన దిమాగీ నక్సల్ పదంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యపై కాంగ్రెస్, సీపీఐ, సమాజ్‌వాదీ తదితర ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. మోదీ గతంలో తన రాజకీయ ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అని పిలిచారని, ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అంటున్నారని విమర్శించారు. ఇది ప్రధాని నిరాశకు సంకేతమని అన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు దిమాగీ నక్సల్స్ అంటే ఎవరో చెబుతూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం వ్యంగ్యంగా స్పందిస్తూ.. తాను 'దిమాగీ నక్సల్స్‌గా ఉండటానికి గర్విస్తున్నారని అన్నారు. రిజిజు ప్రకారం, దిమాగీ నక్సల్స్ అంటే.. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు, ఆర్టికల్ 370కు మద్దతు ఇచ్చేవారు, దేశ ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశం నుంచి వేరు చేయడానికి చికెన్ నెక్‌ను తెంచాలని కోరుకునేవారు అని అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అనే పదంపై సీపీఎం, కాక్రోచ్ జనతా పార్టీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎర్రకోటపై నుంచి జాతిని ఉద్దేశిస్తూ ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. అడవుల్లో ఆయుధాలు పట్టుకుని పోరాడిన నక్సలైట్లను దాదాపుగా అంతం చేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలంతో ఉన్న దిమాగీ నక్సల్స్‌ఇంకా అవకాశాల కోసం చూస్తున్నారని, హింస, అశాంతికి దారి తీసే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలంటే అలాంటి వారిని గుర్తించి ఏకాకులు చేయాలని మోడీ అన్నారు. ఈ పదాన్ని ఉపయోగించడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ స్పందించారు. ఈ పదాన్ని ప్రభుత్వాన్ని విమర్శించే వారిని, జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టే వారిని ఉద్దేశించి చేశారని ఆయన అన్నారు. గతంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను విమర్శించే వారిని 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేశారని, ఇప్పుడు ఇదే తరహాలో 'దిమాగీ నక్సల్స్' అనే కొత్త పదాన్ని తీసుకువచ్చారని బేబీ అన్నారు. మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నక్సలిజాన్ని అంతం చేశామని చెబుతున్న విధానంపై బేబీ ప్రశ్నలు లేవనెత్తారు. యువకులు, యువతను పట్టుకుని న్యాయపక్రియ ముందు నిలబెట్టే బదులుగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదమని అభివర్ణించారు. వామపక్షాలు నక్సలిజాన్ని ఎప్పుడూ సమర్థించలేదని బేబీ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, దిమాగీ నక్సల్స్ ఇప్పుడు రాజకీయ రచ్చకు దారి తీసింది.


## బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శ్రావణమాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ముఖ్యమంత్రి పర్యటనలో లేఖ కలకలం

ములుగు జిల్లా సమ్మక్క--సారక్క తాడ్వాయి మండలం మేడారం ఏటీపీహెచ్ పేరుతో వెలసిన హ్యాండ్ బిల్ లేఖల కలకలం సృష్టించాయి. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించేందుకు గద్దెల పైన ఉన్నటువంటి కార్యక్రమం ముందస్తు సమాచారం లేకుండా నిర్వహించక పోవడంతో పాటు గద్దెల పక్కన ఉన్నటువంటి పోస్టర్లు, బ్యానర్లు తొలగించారు. అలాగే భద్రత లోపానికి నిరసనగా నిలిచిన లేఖలో పలు అంశాలు ఉన్నాయి. "మేము ఇంకా ఉన్నాము" అని చెబుతూ ఈ లేఖ అంటూ తెల్లటి కాగితం పై రెడ్ పెన్‌తో రాయడంతో పాటు సూత్తె కొడవలి గుర్తును సైతం ఏర్పాటు చేశారు. లేఖలో "మీకు హక్కులే.. శబ్దం తగ్గలేదు.. శాంతించామని అనుకోకండి.. మౌనంగా ఉన్నంత మాత్రాన ఓడిపోయామని భావించకండి.. మా



ఉనికిని, మా పట్టుదలను తక్కువగా అంచనా వేసే వారికి హెచ్చరిక.. మా హక్కుల కోసం మేము ఎప్పుడూ ఉంటాం.. సమయం వచ్చింది.. మునుపటి కంటే మరింత బలంగా నిలబడతాం.. ఇట్లు ఎటీపీహెచ్" అని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న నార్లాపూర్ ఎస్సై అచ్చ కమలాకర్ సిబ్బందితో కలిసి ఐటీడీఏ క్యాంపు కార్యాలయానికి చేరుకొని సదురు లేఖలను తొలగించారు. కాగా సీఎం పర్యటన సందర్భంగా ఐటీడీఏ గేటుకు ఎవరు అంటించి వెళ్లారనేది చర్చనీయాంశంగా మారగా, రాష్ట్ర డీజీపీ సీవి ఆనంద్ మావోయిస్టుల ఉనికి తెలంగాణలో లేదని చెప్పి వెళ్లి వారం రోజులు గడవక ముందే ఇలా జరగడం ప్రజల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే ఈ పోస్టర్లు ఎవరు అంటించి ఉన్నారనే కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆరెస్ పార్టీ భారీ ధర్నా, ర్యాలీ అడ్డుకున్న పోలీసులు



బీఆరెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి రామారావు (కేటీఆర్) ఆదేశాల మేరకు, ములుగు జిల్లా బీఆరెస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు పిలుపు మేరకు ఎండి ఖాజా పాషా ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలో బీఆరెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే 'కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్' పథకాలను నిలిపివేయడాన్ని, అన్నదాతలకు అండగా నిలిచే 'రైతు భీమా' పరిహారాన్ని అందజేయక పోవడాన్ని నిరసిస్తూ బీఆరెస్ శ్రేణులు భారీ ర్యాలీగా బయలుదేరగా, పోలీసులు ర్యాలీని మధ్యలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసుల ఆంక్షలను నిరసిస్తూ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపైనే బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమం పూర్తయిన తర్వాత బీఆరెస్ పార్టీ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు ముఖ్య నాయకులు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులతో అణచివేత చర్యలు ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అణచివేసే కుట్ర చేస్తోందని, శాంతియుతంగా చేపడుతున్న ర్యాలీలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు.

**పేదల పథకాలపై కక్ష సాధింపు**

కేసీఆర్ హయాంలో పేద ఇంటి ఆడపడుచు పెళ్లికి కొండంత అండగా నిలిచిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే పక్కన పడేసిందని, నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అంతేకాక రైతు భీమాను గాలికి వదిలేశారని, రైతుల కుటుంబాలకు భరోసానిచ్చే 'రైతు భీమా' పథకాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తూ, మరణించిన రైతుల



కుటుంబాలకు పరిహారం అందకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. అలాగే నిలిచిపోయిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, రైతు భీమా పరిహారాన్ని తక్షణమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏటూరునాగారం గడ్డ నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండి ఖాజా పాషా ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, కర్ర రవీందర్, మాదరి రామయ్య, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, దన్నపునేని కిరణ్, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, కూనూరు చిరంజీవి, బెడక రమేష్, రావిలాల పోశయ్య, గండ పెల్లి నర్సయ్య, వావిలాల రాంబాబు, వార్డ్ మెంబర్ నాగరాజు, కొండాయి చిన్ని, రామకృష్ణ, గంప కిరణ్, ఏం పెల్లి రాజు, వావిలాల కిషోర్, దేపాక శ్రీరామ్, నాగ సాగర్, కాత యాదగిరి, పెంచికల లక్ష్మీనారాయణ, రామటెంకి రాజకుమార్, రమేష్, సాగర్, కట్టుకూరి రాఖి, ఎర్రల సారయ్య, జాడి రాజు, మాదరి మధు, పాలకుర్తి విజయ్, పాలకుర్తి శ్రీను, జనగం సారయ్య, గారితో పాటు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆరెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి



బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ,మండల పార్టీ అధ్యక్షులు తాత గణేష్ పిలుపు మేరకు మండల ఉపాధ్యక్షులు బానోత్ మురళికృష్ణ ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలకు చట్ట బద్దత కల్పించి యధావిధిగా కోనసాగించాలని,అదేవిధంగా రైతు భీమా ప్రీమియం వెంటనే చెల్లించాలని సోమవారం బయ్యారం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్ర మం నిర్వహించి వివిధ డి మాండ్లతో కూడిన మెమో రండం బిఆర్ఎస్ నేతలు తాహశీల్దార్ నాగరాజుకు అందించారు. ఈ సందర్భ ంగా నాయకులు మాట్లాడు తూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్య మంత్రి కేసీఆర్ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహా లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపె ట్టారని తెలిపా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా మాజీ జడ్పీ చైర్పన్ అంగోత్ బిందు, సోసైటీ మాజీ వైస్ చైర్మన్ గంగుల సత్యానా రాయణ, సీనియర్ నాయకులు ఏనుగుల ఐలయ్య, మండల నాయకులు పార్టీ సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కల్యాణలక్ష్మి నిధులు విడుదల చేయాలి



పేదింటి ఆడపడుచుల వివాహాలకు ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల నిధులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వెంకటాపురం తహసీల్దార్ వేణుగోపాల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుకు పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ప్రస్తుతం నిధుల విడుదల విషయంలో ప్రభుత్వం హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. కాగా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్ధిదారులు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారని, పెళ్లిళ్లు నిశ్చయమైన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం వెంటనే స్పందించి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదీకాక లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేగవంతంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం



ప్రజావాణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వెంకటాపూర్ మండల ఎంపీడీవో రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో ఆఫీసులో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ గా ఎంపీడీవో వ్యవహరించి వినతులను స్వీకరించారు. కాగా మండల కేంద్రాల్లో వినతులు స్వీకరించడం ద్వారా ప్రజలకు సత్వర పరిష్కారాలు దొరుకుతాయని పేర్కొన్నారు. ఐతే మండల ప్రజలు తమ సమస్యల వినతులను మండల స్థాయిలో జరిగే ప్రజావాణిలో ఇకనుండి సమర్పించాలని తెలిపారు. అలాగే ప్రజల సౌకర్యార్థం మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహిస్తున్నందున జిల్లా కేంద్రానికి వెళ్లవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మండల వ్యాప్తంగా మొత్తం 26 వినతులు వచ్చాయని పేర్కొన్నారు. అదేవిధంగా అందులో 19 రెవిన్యూ దరఖాస్తులు, మూడు పెన్షన్స్, ఇందిరమ్మ, విద్యుత్, మిషన్ భగీరథ, ఇరిగేషన్ అధికారులకు ప్రజావాణిలో తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో, పోలీస్,ఎంపిఓ, వెటర్నరీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ అధికారులు, అంగన్వాడి సూపర్వైజర్లు, మరియు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# బాధితుడికి అపన్న హస్తం




బయ్యారం మండల కేంద్రంలోని ముస్తఫా నగర్ కాలనికి చెందిన పెద్ద మీరా సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రిందపడి కాలు ఫ్యాక్చర్ అవ్వడంతో స్పందించిన ముస్తఫా నగర్ వాసులు గొప్ప మనసు చాటుకొని బాధితుడికి 65.500 వేల రూపాయలు నగదు,ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులు అందించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్థిక సాయం అందేలా చేసిన షేక్ బాషా,షేక్ మదార్ ప్రిన్సిపాల్, షేక్ నాగుల్ మీరా, వార్డు సభ్యులు జానీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్తఫా నగర్ యువత,మిత్రులు,తదితరులు పాల్గొన్నారు.

# బస్సు డిపో పనులు పూర్తి చేసి సేవలందించాలి



బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ లో ఏటూరునాగారం బస్సు డిపో పనులు త్వరితగతిన పూర్తి చేసి డివిజన్ ప్రజలకు సేవలందించాలని సోమవారం వినతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో పనులు నత్తనడకన కొనసాగుతూ పూర్తి చెయ్యక పోవడానికి కారణం ఏమిటని కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్ డిప్యూటీ కలెక్టర్ మహేందర్ జి కి వినతి పత్రం అందజేశామన్నారు. ఈ విషయం పై స్పందించిన డిప్యూటీ కలెక్టర్ కాంట్రాక్టర్ తో మాట్లాడి బస్సు డిపో పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతం లో ఉన్న కాంగ్రెస్ బీఆరెస్, సిపిఎం, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు ప్రతి ఒక్కరు ఈ ప్రాంత అభివృద్ధి కోసం స్పందించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా,, జాడి రామరాజు నేత అన్నారు.


Dr. Jadi Ramaraju Netha
Ex MPP
Kisan Morcha
Dist. President Mulugu
9440220203

తేది : 03.08.2026

## ప్రథమ వర్ధంతిలో సోదా నివాళులు



పరకాల పట్టణానికి చెందిన పాక్స్ మాజీ చైర్మన్ పూజారి సాంబయ్య గౌడ్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పాల్గొని సాంబయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు మార్క రఘుపతి గౌడ్, పసుల రమేష్, నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, చిర్ర రాజయ్య, కొత్తపెల్లి రవి, బొచ్చు భాస్కర్, బొచ్చు జెమిని, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం గేయాన్ని అవమానించడం సరికాదు



దేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన జాతీయ గేయం వందేమాతరాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ అవమానించేలా వ్యవహరించడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రరావు అన్నారు. కాంగ్రెస్ తీరును నిరసిస్తూ సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్ వద్ద బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ దేశభక్తి భావాలను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. వందేమాతరం గేయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తించి, దాని పట్ల గౌరవభావంతో వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ తీరును నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం బీజేపీ, బీజేవైఎం , వివిధ అనుబంధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు కలిసి పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. 'భారత్ మాతా కీ జై' నినాదాలతో వివేకానంద చౌరస్తా మార్మోగింది. దేశభక్తి భావాలతో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమం విజయవంతమైందని, కార్యక్రమానికి పిలుపునిచ్చిన వెంటనే స్పందించి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువమోర్చా శ్రేణులు, వివిధ మోర్చాల నాయకులకు జిల్లా కమిటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ నిరసనలో గడ్డం ఆశోక్, పవన్, ప్రవీణ్, ఇందు భారతి, రేష్మా, చుక్కల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభాస్థలిలో ప్రభుత్వం పై ఆరోపణలు చేసిన మహిళ

ములుగు జిల్లా కేంద్రంలో సీఎం సభలో మల్లంపల్లి మండల కేంద్రానికి సంబంధించిన ఒక మహిళ ఆరోపణల పైన మల్లంపల్లి మండల ప్రజలకు అనేక ప్రశ్నల చర్చ కొనసాగడం జరిగింది. గ్యాస్ సిలిండర్‌ను ?500కే ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ప్రస్తుతం ?1,010కు పైగా చెల్లించాల్సి వస్తోందని మహిళలు విమర్శిస్తున్నారని, విషయంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇస్తుందా సీఎం సభలోనే ఒక మహిళ గ్యాస్ ధరపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది ?500 గ్యాస్ హామీని ప్రభుత్వం ఎప్పుడు, ఎలా అమలు చేయబోతోంది? ప్రజలకు స్పష్టమైన గడువు ప్రకటిస్తారా? మల్లంపల్లి మండలంలో రెవెన్యూ కార్యాలయంలో పనులు చేయించుకోవడానికి లంచాలు అడుగుతున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయా? వస్తే వాటిపై అధికారులు విచారణ చేపట్టారా ఎంఆర్ఓ కార్యాలయంలో లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై ఎంఆర్ఓ స్వయంగా ఏం సమాధానం చెబుతున్నారు? లంచాలు అడిగినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే, ఆ ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందా? సాధారణ ప్రజలు తమ భూమి, పట్టా, రెవెన్యూ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుండగా, లంచం



లేకుండా ప్రభుత్వ సేవలు అందుతున్నాయా లేదా? ప్రజల ఆరోపణలు నిజమైతే బాధ్యులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటార అని ప్రజలంటున్నారు. అలాగే ఆరోపణలు తప్పైతే వాటిని నిరూపించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారా, సీఎం సభలోనే ప్రజలు ప్రభుత్వ విధానాలను బహిరంగంగా ప్రశ్నిస్తున్న పరిస్థితిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందిస్తారా, మల్లంపల్లి మండలంలోని రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులతో స్వతంత్ర విచారణ చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనే విధంగా చర్చ జరిగింది.

కానీ పై అంశాల నందు మల్లంపల్లి మండల రెవెన్యూ డిప్యూటీ తహసిల్దార్ రెవెన్యూ కార్యాలయంలో లంచాలు తీసుకుంటున్నారు అనే ఆరోపణపై విచారించగా ఆమె యొక్క వ్యక్తిగత సమస్య అయిన ఆమె కూతురు బర్త్ సర్టిఫికెట్ కోసం కార్యాలయానికి రెండు మూడు సార్లు రావడం జరిగింది వాస్తవమే కానీ అక్కడ ఉన్న అధికారులు ఎవరు లంచాలు అడగలేదని నిరూపణ జరిగింది. దీంతో నిన్న జరిగిన సీఎం సభలో మల్లంపల్లి మండలానికి చెందిన ఆ మహిళ" ఆరోపణలు" అవస్తవాలుగా నిరూపించడం జరిగింది. కానీ ప్రభుత్వము 500 కే సిలిండర్ గ్యాస్ ఇస్తానని చెప్పి 1050 రూపాయలు వసూలు చేస్తున్నారు కదా అని అసంతృప్తి, వ్యతిరేకత ఈ ప్రభుత్వంపై కనబరుస్తున్నారు.

# బయ్యారం ప్రజావాణి కార్యక్రమానికి స్పందన




బయ్యారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో సోమవారం అధికారులు ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేశారు.మండల తహశీల్దార్ నాగరాజు,ఎంపిడిఓ దీపిక,మండల ఇతర శాఖల అధికారులు ఉదయం 10 గం,,లనుండి,మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరి ంచారు. ఈ కార్యక్రమం మండలంలో మొదటిసారి నిర్వహించడం వల్ల ప్రజల నుండి తక్కువ స్పందన వచ్చినట్లు అధికారులు తెలిపారు.ప్రజల ఫిర్యాదుల్లో భూ సమస్యలు,ఆసరా పెన్షన్లు,రక్షిత మంచినీటి బోరింగ్ రిపేరు పనుల కాంట్రాక్టర్ దనసరి వెంకన్న వేతనాలు 5 సంవత్సరాలనుండి పలు పంచాయతీల నుండి బోరింగ్ రిపేర్ వేతనాలు అందలేదని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.బాలాజీ పేట వీవో బిల్డింగ్ పనుల నిలిపివేతపై , బాలాజీపేట సర్పంచ్ మాలోత్ పార్వతి దరఖాస్తు ఇచ్చారు.కేవీఎల్ నరసింహారావు గంధంపల్లి గ్రామం నుండి దివ్యాంగుల పెన్షన్ రెన్యువల్ కోసం 2016 జనవరి నుంచి నేటి వరకు అనేక సార్లు అధికారులను కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సమస్యకు పరిష్కారం కావడం లేదని సోమవారం బయ్యారం ప్రజావాణిలో మళ్ళీ దరఖాస్తు ఇచ్చి సమస్య పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు.ఈ కార్యక్రమంపై తాహ శీల్దార్ నాగరాజును వివరణ కోరగా మండలంలో ప్రజావాణిలో 11దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్,రెవిన్యూ, విద్యుత్,ఆర్అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ,వ్యవసాయ శాఖ,వెలుగు ఎపిఓ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# మండల సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎంపీడీవో రహీమొద్దిన్

మల్లంపల్లి మండల కేంద్రంలోనీ ఎంపిడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం మండల పరిషత్ అధికారి రహిమొద్దిన్ అధ్యక్షతన జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలో వివిధ ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి ప్రజలు వినతుల ద్వారా తెలిపారు. కాగా వినతులతో అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యలను తక్షణమే స్పందించారు. అదేవిధంగా సమస్యలను నమోదు చేసి పరిష్కార ప్రక్రియను ప్రారంభించిన ప్రతి ఒక్క అధికారికి ఎంపీడీవో హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రజావాణి ద్వారా ప్రస్తావించిన ప్రధాన సమస్యలైన పీహెచ్సీ సమస్యలు, బస్ స్టాండ్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాల సమస్యలు, సిబ్బంది కొరత, ఎంపీడీవో, ఎంఆర్వో కార్యాలయాల శాశ్వత నిర్మాణాలు వంటి సమస్యలపై ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో తమ విలువైన సమయం, సహకారం అందించడం, ఊరి




సమస్యల కోసం యువత చూపించిన ఐక్యత, చొరవ, సహకారం అభినందించారు. ఇదే స్ఫూర్తితో మన గ్రామ, మండల అభివృద్ధి కోసం అందరం కలిసి ముందుకు సాగుదామని అధికారుల సహకారంతో ప్రస్తావించిన సమస్యలు త్వరగా పరిష్కారమై, మల్లంపల్లి మండల అభివృద్ధికి మంచి ఫలితాలు రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసిల్దార్, మండల పంచాయతీ అధికారి, డిప్యూటీ తహసిల్దార్,మండల వ్యవసాయ అధికారి, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ సహాయక ఇంజనీరు, అటవీశాఖ రేంజ్ బీట్ ఆఫీసర్, మృత్యు శాఖ అధికారి, పోలీస్ శాఖ, మిషన్ భగీరథ శాఖ, సహాయక ఇంజనీరు, శిశు సంవర్ధక శాఖ అధికారి, మండల విద్యాధికారి, సహాయక ప్రోగ్రాం అధికారి, విద్యుత్ శాఖ, సహాయక సంచాలకులు గృహ నిర్మాణ ఇంజనీరు, సహాయ ప్రోగ్రాం మేనేజర్ ఇందిరా క్రాంతి పథకం అధికారి, నీటిపారుదల శాఖ, సహాయక ఇంజనీరు, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికే 'ప్రజావాణి' కార్యక్రమమని, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ నాగవాని ల తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు అత్యంత బాధ్యతగా స్వీకరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, చట్ట నిబంధనల ప్రకారం అర్హులకు తక్షణమే న్యాయం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు ప్రధానంగా భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ పథకం మరియు స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీ సమస్యలపై కలెక్టర్కు వినతి పత్రాలు సమర్పించారు. కేసముద్రం మండలం బేరువాడ కు చెందిన శ్యామల, అదేవిధంగా గార్ల మండలం తిర్లాపురం గ్రామానికి చెందిన మాలోత్ వెన్నెల ఇద్దరు ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరిపెడ మండలం పురుషోత్తమాయ గూడెం గ్రామానికి చెందిన దాట్ల భార్గవ్ నిరుపేద కుటుంబానికి చెందిన తనకు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల 6వ తరగతి ప్రవేశం ఇప్పించగలరని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు, నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి భోజన వసతి, తాగునీరు, పరిశుభ్రత, మెనూ అమలు మరియు విద్యార్థుల హాజరును ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. తనిఖీల సమయంలో ఏవైనా లోపాలు లేదా విద్యార్థుల సమస్యలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. నిర్వహించిన తనిఖీల వివరాలతో కూడిన నివేదికను క్రమం తప్పకుండా సమర్పించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న అర్జీలను సంబంధిత అధికారులు తమ లాగిన్లలో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలి. అధికారులందరూ ప్రతిరోజూ తమ అధికారిక లాగిన్‌లను తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఫిర్యాదులు లేదా వినతులను అలసత్వంగా వదిలేయకుండా, నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపి డిస్పోస్ చేయాలని అన్నారు. అవసరమైన విషయాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి నిజానిజాలు విచారించిన పిమ్మటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలపై తీసుకున్న చర్యలను దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, ఒకవేళ వినతిని తిరస్కరిస్తే దానికి గల సరైన కారణాలను రికార్డు చేయాలని, కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (110) దరఖాస్తులు వచ్చాయని, ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల వారీగా కంప్యూటరైజ్ చేసి, సంబంధిత అధికారులకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. నిర్ణీత కాలవ్యవధిలోగా వీటికి పరిష్కారం చూపి, నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డి.ఆర్.డి ఏ మధుసూధనరాజు, లీగల్ సెల్ అథారిటీ అధికారి అడ్వకేట్ కమల్, సి.పి.ఓ శ్రీనివాస రావు, సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసరావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, ఎస్.సి కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, డి.ఏ.ఓ విజయ్ చంద్ర, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, ఇండస్ట్రీస్ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్, సివిల్ సప్లై అధికారి నరసింహారావు, డి.ఎం.సివిల్ సప్లై అధికారి రమేష్, ఎల్.డి.ఎం యాదగిరి, డి.ఈ.ఓ సత్యనారాయణ మూర్తి, ఇంటర్మీడియేట్ అధికారి మదార్, మహబూబాబాద్ మునిసిపల్ కమిషనర్ వినోద్ కుమార్, ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారి శిరీష, బి.సి వెల్ఫేర్ అధికారి సాయి శ్రీజ, ఎంప్లాయ్మెంట్ అధికారి రజిత, యువజన క్రీడల అధికారి జ్యోతి, మెప్మా అధికారి విజయ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్ లు, ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగేందర్, భూభారతి డిస్ట్రిక్ట్ కో.ఆర్డినేటర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా 101-డోర్నకల్, 102-మహబూబాబాద్ అసెంబ్లీ నియో జకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 571 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 4,36,946 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 101-డోర్నకల్ నియోజకవర్గంలో 2,05,083 మంది, 102-మహబూబాబాద్ నియోజకవర్గంలో 2,31, 863 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 2,15,458 మంది పురుషులు, 2,21,449 మంది మహిళలు, 39 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఓటరూ ముసాయిదా జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచిం చారు. అర్హత ఉన్నప్పటికీ పేరు జాబితాలో లేకపోయినా, ఇప్పటికే నమోదైన వివరాల్లో తప్పులు లేదా మార్పులు ఉన్నా నిర్ణీత గడువులోగా దావాలు, అభ్యంతరాలు సమర్పించాలని కోరారు. ముసాయిదా ఓటర్ల జాబితాలు సంబంధిత పోలింగ్ కేంద్రాలు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ), తహసీల్దార్ (ఏఈఆర్‌ఓ), ఆర్డీఓ (ఈఆర్‌ఓ), కలెక్టర్ (డీఈఓ) కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపా రు. పని దినాల్లో ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం--6, నమోదుపై అభ్యంతరం లేదా పేరు తొలగింపునకు ఫారం--7, ఓటరు వివరాల్లో సవరణలు లేదా నివాస మార్పు కోసం ఫారం--8 వినియోగించుకోవచ్చని తెలిపారు. దావాలు, అభ్యంతరాలను బీఎల్‌ఓలకు నేరుగా సమర్పించడంతో పాటు ఈసీఐనెట్ యాప్ లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓ కార్యాలయాలు, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో దావాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 16వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఓటర్ల వివరాలు ఖచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజక వర్గాల ప్రజలు ముసాయిదా జాబితాను పరిశీలించి, అవసరమైన సవరణల కోసం సెప్టెంబర్ 16లోగా సంబంధిత ఫారాలను సమర్పించాలని కోరారు.

# చట్టాలను తెలుసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్ కృష్ణ అన్నారు. సోమవారం జిల్లాలోని కురవి పట్టణంలోని అంగడి ప్రాంగణంలో చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలను తెలుసుకోవడం, తమ హక్కులను కాపాడుకోవడం ప్రతి బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని, కులం, మతం, లింగం, ప్రాంతం ఆధారంగా ఎవరిపట్లా వివక్ష చూపకూడదని తెలిపారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలను కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలతో వెట్టిచాకిరీ చేయించడం, బలవంతంగా పనులు చేయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహాలు వంటి దురాచారాలకు పాల్పడి పిల్లల భవిష్యత్తును నాశనం చేయవద్దని హితవు పలికారు. 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు, శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే డ్రగ్స్ (మత్తుపదార్థాలు) వినియోగించడం, కలిగి ఉండటం, విక్రయించడం చట్టరీత్యా నేరమని, నేర తీవ్రతను బట్టి కఠినమైన జైలు శిక్షలు పడే అవకాశం ఉందని వివరించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ప్రజలకు న్యాయపరమైన సలహాలు, సూచనలు అవసరమైనప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని ఆయన తెలిపారు. చట్టాలపై అవగాహన పెంచుకొని తమ హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. ఈ మహిళ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.



## భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మెడికల్ ఆఫీసర్‌ను నియమించాలి: 'ప్రజావాణి'లో చిట్టి ప్రశాంత్ వినతి



భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తక్షణమే మెడికల్ ఆఫీసర్ (వైద్యాధికారి)ని నియమి ంచాలని కోరుతూ సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో సామాజిక కార్యకర్త చిట్టి ప్రశాంత్ సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండటంతో స్థానిక ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద ప్రజలకు అరకొర వైద్యంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

**ప్రాథమిక వసతులు కల్పించాలి:**

వైద్యుడి నియామకంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం ఉన్న లోపాలను సరిదిద్ది, రోగులకు అవసరమైన ప్రాథమిక వసతులు, సౌకర్యాలను కల్పించాలని స్థానిక గ్రామస్తులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి ఎం హెచ్ వో వెంటనే స్పందించి, భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి పూర్తిస్థాయి మెడికల్ ఆఫీసర్‌ను కేటాయించాలని ప్రజాపాలన వినతిపత్రంలో స్పష్టంగా కోరారు. ?సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని స్థానికులు ఆశిస్తున్నారు.



## ప్రజా ప్రభుత్వం పాలనకు వ్యతిరేకంగా నిరసనలు

కన్నాయిగూడెం మండల కేంద్రంలో బీఆరెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే 'కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్' పథకాలను నిలిపివేయడాన్ని, అన్నదాతలకు అండగా నిలిచే 'రైతు భీమా' రైతు బందు, దళిత బందు పరిహారాన్ని అందజేయక పోవడాన్ని నిరసిస్తూ బీఆరెస్ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా బయలుదేరి ఎమ్మార్వో కార్యాలయం తుపాకులగూడెం మెయిన్ రోడ్డు పై బైటాయించి నిరసన తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. అనంతరం నాయకులు తహసీల్ధార్, ఎంపీడీవో లకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా బీఆరెస్ పార్టీ నాయకులు చిన్ని కృష్ణ, పూజారి కిషోర్, చిలుముల రాంబాబు, మట్టం వెంకటేష్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**పేదల పథకాలపై కక్ష సాధింపు**

కేసీఆర్ హయాంలో పేద ఇంటి ఆడపడుచు పెళ్లికి కొండంత అండగా నిలిచిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే పక్కన పడేసిందని, నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు ఇవ్వకపోవడం దారుణమన్నారు.రైతు భీమాను గాలికి వదిలేశారు. కాగా రైతుల కుటుంబాలకు భరోసానిచ్చే 'రైతు భీమా' పథకాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తూ, మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం అందకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. నిలిచిపోయిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, రైతు భీమా పరిహారాన్ని తక్షణమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కన్నాయిగూడెం గడ్డ నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ మాజీ అధ్యక్షులు సునర్కానీ వెంకటయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శిలుముల రాంబాబు, మండల ఉపాధ్యక్షులు గడ్డం నరేందర్, గ్రామ కమిటీ అధ్యక్షులు సింగారం దేవర సుధాకర్, గ్రామ కమిటీ అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ కావేరి సంతోష్, దుర్గం రాజేష్, మండల సీనియర్ నాయకులు జనగాం లక్ష్మీపతి, కావేరి నర్సింగారావు, మల్లెల లక్ష్మయ్య, మల్లెల బాలయ్య, కొండ గొర్ల వెంకటయ్య, జనగాం సత్యం, బండి రాంబాబు, మండల సీనియర్ నాయకులు గారితో పాటు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# మండల స్థాయి ప్రజావాణికి విశేష స్పందన: ఆకట్టుకున్న శోభాయమాన ఏర్పాట్లు



మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. కానాపురం ఎంపీడీవో ప్రత్యేక శ్రద్ధతో మామిడి తోరణాలు, అరటి మొక్కలు, రంగురంగుల రంగవల్లికలతో వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రజలకు ఎలాంటి అయోమయం కలగకుండా అన్ని శాఖల అధికారుల కుర్చీలపై వారి హోదాలను స్పష్టంగా ప్రదర్శిస్తూ అత్యంత క్రమశిక్షణతో, అద్భుతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజావాణికి ప్రజల నుండి విశేష స్పందన లభించగా, వివిధ సమస్యలపై మొత్తం 40 దరఖాస్తులు వచ్చాయి.

**ప్రజావాణి పేదల పాలిట వరప్రసాదం:**

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మండల స్థాయి ప్రజావాణి నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. జిల్లా కేంద్రాలకు వెళ్లే పనిలేకుండా, సొంత మండలంలోనే నడుచుకుంటూ వచ్చి సులభంగా అధికారులకు సమస్యలు విన్నవించుకునే అవకాశం లభించిందని తెలిపారు. దీనివల్ల ప్రజలకు డబ్బు, విలువైన సమయం ఆదా అవుతోందని, ఈ గొప్ప ఆలోచన చేసిన ప్రభుత్వానికి ప్రజలు నీరాజనాలు పడుతున్నారని కొనియాడారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అప్లికేషన్‌ను పరిశీలించి, గరిష్టంగా 15 రోజుల వ్యవధిలోనే బాధితులకు పూర్తి సమాచారం, పరిష్కారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

**అవార్డు గ్రహీత ఎమ్మార్వోకు ఘన సన్మానం:**

ప్రజావాణి ముగిసిన అనంతరం కానాపురం తహసీల్దార్ ఉత్తమ సేవలకు గానూ 'బెస్ట్ అవార్డు' దక్కించుకోవడతో ఎంపీడీవో ఆధ్వర్యంలో వారిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ప్రజా సేవలో నిరంతరం ముందుంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికే తమ శ్రమ ధారపోస్తామని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.






## మండల స్థాయి ప్రజావాణికి 42 దరఖాస్తులు



మంగపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి 35 మంది అధికారులు హాజరు కాగా 42 దరఖాస్తులు వచ్చాయాని మంగపేట ఎంపిడీఓ భద్రు తెలిపారు. మొదట మందకోడీగా సాగిన కార్యక్రమం చివరి గంటలో దరఖాస్తుదారులు బారులు తీరారు.మండలంలోని 25 గ్రామాల నుంచి ప్రజలు తమ వివిధ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించేందుకు క్యూలైన్లలో వేచి నిలబడ్డారు. నిర్ణీత సమయం ముగిసినప్పటికీ, దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అధికారులు వినతులను స్వీకరించారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వాటిని ఆయా శాఖలకు చెందిన అధికారులు త్వరితగతిన పరిష్కారం చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, రైతు బీమా బకాయిలు చెల్లించాలి

తాడ్వాయి మండలం జాతీయ రహదారి 163 పై బీఆరెస్ పార్టీ శ్రేణులు సోమవారం నిరసన ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు, రైతు బీమా పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు పిలుపు మేరకు మండల అధ్యక్షుడు దండుగల మల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు నెలల తరబడి చెక్కులు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. అంతేకాక రైతు భీమా కింద మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం అందక అన్యాయం జరుగుతోందని విమర్శించారు. కాగా ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన చేపడుతున్న ప్రతిపక్షాలను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు రైతు బీమా పరిహారాన్ని తక్షణమే లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే తాడ్వాయి నుంచే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కుట్రలు మానుకోవాలి



కల్యాణలక్ష్మి, షాదీ ముబా రక్ పథకాలపై కుట్రలు మానుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామ కృష్ణ తెలిపారు. సోమవా రం ప్రజా వాణి కార్యక్రమంలో భాగంగా దామెర మండల పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్ర లో తహసీల్దార్, ఎంపీడీఓలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేయాలనే కుట్ర చేస్తున్న విషయాన్ని ఖండిస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గండు రామకృష్ణ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు చేయాలనీ ఒక గొప్ప సంకల్పంతో దేశంలోనే ఏ ముఖ్యమంత్రి ఆలోచించని విధంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాలను ప్రవేశ పెట్టినట్లు గుర్తు చేశారు. ఈ పథకాల ద్వారా ఎంతో మంది పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు జరిగాయని, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని పదే పదే చెపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కుట్ర చేస్తున్నారాని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జాకిర్, పోలం కృపాకర్ రెడ్డి, నేరెళ్ల కమలాకర్, దాడి మల్లయ్య, గరిగే కృష్ణమూర్తి, బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి, దుబాసి నవీన్, కన్నెబోయిన రమేష్ యాదవ్, పుల్యాల రఘుపతిరెడ్డి, కునాటి సునీల్ రెడ్డి, సిలువేరు రాజు, నక్క రాజేందర్, కిరణ్, మిరాల రవి, గండు దివాకర్ గౌడ్, మెరుగు సంపత్ తదితరులు పాల్గొన్నారు.




# ఆశ్రమ పాఠశాల సామగ్రి చోరీపై విచారణ చేపట్టాలి

మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్మాణ పనులకు వినియోగించాల్సిన ఇనుప రాడ్లు, పైకప్పు రేకులు తదితర సామగ్రి చోరీకి గురైనట్లు బొర్ర శ్రీరాములు, అయిలబోయిన వెంకటేశ్వర్లు, సుదగాని ప్రభాకర్, కోర్స విష్ణు ఆరోపించారు. ప్రభుత్వానికి చెందిన నిర్మాణ సామగ్రి అక్రమంగా తరలింపుపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్యాల గ్రామానికి చెందిన నూకల రవి (వార్డు మెంబర్) తదితరులు పాఠశాల నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని అక్రమంగా తరలించి వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. రాత్రి వేళల్లో ఇనుప రాడ్లు, పైకప్పు రేకులు తదితర సామగ్రిని తరలించి, తన ఇంటి పక్కనే ట్రాక్టర్ కోసం షెడ్డు ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పాఠశాల నిర్మాణ పనులకు సంబంధించిన సామగ్రి దుర్వినియోగం అవుతుండటం ఆందోళన కలిగిస్తోందని గ్రామ ప్రజలు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని, ఈ వ్యవహారంపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న నిర్మాణ సామగ్రి వివరాలను అధికారులు పరిశీలించి, ఎంత మేర సామగ్రి కొరత ఏర్పడిందో లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు. చోరీకి గురైన ట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సామ గ్రిని వెంటనే రికవరీ చేయడంతో పాటు, అక్రమ తరలింపునకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో పారదర్శకత ఉండేలా సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రెడ్యాల ఆశ్రమ పాఠశాలలో సామగ్రి చోరీపై తక్షణమే విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, తమ ఫిర్యాదుపై న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

**అప్పుడు**



**ఇప్పుడు**



## పీడీఎస్ బియ్యం తరలిస్తున్న కారు పట్టివేత

**-ధృవీకరించని అధికారులు**
**-పలు అనుమానాలకు తావీ**

ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధీలో సోమవారం సాయంత్రం పోలీసులు చేపట్టిన వాహన తనిఖీలలో కారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారని సమాచారం. దీంతో తాడ్వాయి పీఎస్, నార్లాపూర్ పీఎస్ లకు ఫోన్ చేసి సమాచారం కోరగా అలాంటిదేమీ లేదని పోలీసులు ధృవీకరించలేదు. ఐతే విశ్వసనీయ సమాచారం మేరకు మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు డిక్కీలో 14 బియ్యం సంచులు ఉండగా మొత్తం 6 క్వింటాళ్ల 72 కిలోల బియ్యం ఉన్నట్లు తెలిసింది. అలాగే పట్టుబడిన బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి పౌరసరఫరాల శాఖ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించినట్లు సమాచారం. అదీకాక బియ్యం ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే వివరాలపై అధికారులు ఆరాలో పడ్డారు. ఈ విషయాన్ని అధికారకంగా ధృవీకరిచక పోవడం పై అంతర్యమేమిటని, ఎవరైన పలుకుబడి ఉన్న వ్యక్తుల పనియేనా అని మండల వాసులు అనుకుంటున్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com